తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి-82 సంచిక-11 వ్యవసాయ శాఖ పేజీలు - 52 నవంబర్ - 2024











2024 నవంబర్ 02న హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా కేంద్రంలో కొత్తగా నియమితులైన వ్యవసాయ అధికారుల శిక్షణా కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్., వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్., మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణా కేంద్ర డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్, ఐ.ఎ.ఎస్.తో సహా హాజరైన వ్యవసాయ అధికారులు

2024 నవంబర్ 9న వ్యవసాయ అధికారుల శిక్షణా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్., రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, డా.పాండురంగారెడ్డి, హెడ్, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్, సహా ఉన్నతస్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు, శిక్షణలో పాల్గొన్న కొత్త వ్యవసాయ అధికారులు, తదితరులు














తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి : 82 నవంబర్ - 2024 సంచిక : 11

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఆశ్వీయుజం - కార్తీకం

వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు, వ్యవసాయ పాడిపంటలు మాస పత్రిక, ఇతర సమాచారం కోసం
http://vyavasayam.telangana.gov.in, https://agri.telangana.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించండి!

## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు
డా. బి. గోపి, ఐ.ఎ.ఎస్
వ్యవసాయ సంచాలకులు



సంపాదకులు
కె. విజయ్ కుమార్
అదనపు వ్యవసాయ సంచాలకులు

సహాయ సంపాదకులు
* టి. సుజాత
* సయ్యద్ ఇంతియాజ్ అహమ్మద్
* పెద్దిరెడ్డి వరలక్ష్మి

సంపాదక మండలి సభ్యులు
డి.వి. రామక్రిష్ణారావు

**రచనలు పంపాల్సిన చిరునామా**

సహాయ వ్యవసాయ సంచాలకులు (ముద్రణ)
వ్యవసాయ కమిషనరు వారి కార్యాలయం
ఎల్.బి. స్టేడియం ఎదురుగా,
హైదరాబాద్-500 001.

గమనిక : రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనా విభాగం వారి ఆదేశాల మేరకు పాడిపంటలు మెయిల్ ఐ.డి. ఇకపై
**tgpadipantalu@gmail.com**
పాత మెయిల్ ఐ.డి.లోని ts స్థానంలో tg చేర్చాము.

పాత మెయిల్ ఐ.డి. tspadipantalu@gmail.com

**Published & Printed by**
Dr. B. Gopi, I.A.S.,
Director of Agriculture,
Government of Telangana, Opp. L.B. Stadium,
Basheerbagh, Hyderabad-500 001, through
Telangana State Agro Industries Development
Corporation Limited (TSAIDC Ltd.)
Hyderabad

## విషయ సూచిక

1. రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు....4
2. సంపాదకీయం....5
3. నవంబర్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు....6
4. వాతావరణం – పంటల పరిస్థితి....13
5. రైతు స్థాయిలో సజ్జ పంటలో మెళకువలు....15
6. యాసంగిలో ఆవాల పంటఅధిక దిగుబడికి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు....17
7. మిరపలో సస్యరక్షణ....19
8. ధాన్యం కొనుగోలులోఈ నియమాలు పాటిస్తే ధాన్యానికి మంచి ధర....22
9. నూతన వ్యవసాయ అధికారుల శిక్షణా కార్యక్రమం....24
10. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, మెళకువలు....25
11. నాణ్యమైన విత్తనం- ప్రాముఖ్యత....29
12. వరిలో ఎలుకల సమస్య – యాజమాన్య పద్ధతులు....30
13. పత్తి పంట వ్యర్థాలను కాల్చవద్దు....32
14. వరి గడ్డిని కాల్చకుండా కుళ్ళడానికి మార్గాలు....33
15. నీట మునిగిన ఉద్యాన పంటలు తీసుకోవలసిన జాగ్రత్తలు....35
16. గ్లాడియోలస్ సాగులో పాటించే యాజమాన్య పద్ధతులు....37
17. ఔషధ గుణాలు – వంట దినుసులు....40
18. పెరటి కోళ్ళ పెంపకం....44
19. వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రం....46
20. యాసంగికి అనువైన వరి రకాలు....47
21. సాగు... సంగతులు..39....48
22. ఫోన్ – ఇన్ – లైవ్....49

81 సంవత్సరాలుగా రైతాంగానికి సలహాలు, సూచనలు అందిస్తూ, వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, రాయితీలను గురించి సమాచారం తెలియజేస్తూ రైతాంగానికి కరదీపికగా వెలువడుతున్న 'వ్యవసాయ పాడి పంటలు' పత్రికను చదువుదాం. రైతులందరిచేత చదివిద్దాం!

– సం.

## రాష్ట్రంలో సాగైన పంటల విస్తీర్ణం (ఎకరాలలో)

## రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు (మి.మి.లలో)

| క్ర. సంఖ్య | జిల్లాలు | యాసంగి పంటల సాగు విస్తీర్ణం 06.11.2024 వరకు | | 01-06-2024 నుండి 06-11-2024 వరకు | |
|---|---|---|---|---|---|
| | | సాధారణం | నమోదు | సాధారణం | నమోదు |
| 1. | ఆదిలాబాద్ | 142207 | 10870 | 1077.7 | 1114.1 |
| 2. | కొమరంభీం ఆసిఫాబాద్ | 34342 | 571 | 1103.6 | 1215.9 |
| 3. | మంచిర్యాల | 100509 | 160 | 1018.8 | 1029.8 |
| 4. | నిర్మల్ | 262664 | 4096 | 995.5 | 1144.5 |
| 5. | నిజామాబాద్ | 485404 | 33671 | 944.9 | 1126.1 |
| 6. | కామారెడ్డి | 378531 | 18913 | 916.2 | 995.1 |
| 7. | కరీంనగర్ | 276584 | 747 | 834.0 | 1021.1 |
| 8. | పెద్దపల్లి | 204433 | 113 | 962.7 | 1067.2 |
| 9. | జగిత్యాల | 315620 | 1813 | 934.5 | 1050.4 |
| 10. | రాజన్న సిరిసిల్ల | 157471 | 0 | 818.9 | 966.4 |
| 11. | మెదక్ | 204590 | 71 | 774.1 | 919.8 |
| 12. | సంగారెడ్డి | 147592 | 582 | 757.0 | 903.2 |
| 13. | సిద్దిపేట | 310303 | 2725 | 697.7 | 932.5 |
| 14. | వరంగల్ | 182931 | 2075 | 923.2 | 1004.7 |
| 15. | హనుమకొండ | 171737 | 1249 | 948.4 | 1131.0 |
| 16. | మహబూబాబాద్ | 180262 | 117 | 924.4 | 1319.4 |
| 17. | ములుగు | 50917 | 0 | 1244.2 | 1631.3 |
| 18. | జయశంకర్ భూపాలపల్లి | 90231 | 332 | 1024.5 | 1195.4 |
| 19. | జనగాం | 172124 | 680 | 800.5 | 857.8 |
| 20. | ఖమ్మం | 267454 | 0 | 929.0 | 1226.2 |
| 21. | భద్రాద్రి కొత్తగూడెం | 73907 | 841 | 1073.0 | 1318.9 |
| 22. | రంగారెడ్డి | 102063 | 3203 | 640.8 | 758.4 |
| 23. | వికారాబాద్ | 111331 | 11526 | 715.1 | 963.9 |
| 24. | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 13849 | 0 | 709.3 | 789.0 |
| 25. | మహబూబ్‌నగర్ | 115992 | 5500 | 579.0 | 948.3 |
| 26. | నారాయణ్‌పేట | 111072 | 8513 | 554.9 | 972.4 |
| 27. | నాగర్‌కర్నూల్ | 265209 | 100361 | 577.1 | 910.4 |
| 28. | వనపర్తి | 169971 | 0 | 572.5 | 983.8 |
| 29. | జోగులాంబ గద్వాల | 118028 | 11351 | 518.0 | 811.9 |
| 30. | నల్గొండ | 473010 | 964 | 626.5 | 780.1 |
| 31. | సూర్యాపేట | 426405 | 50 | 710.8 | 892.2 |
| 32. | యాదాద్రి భువనగిరి | 237543 | 0 | 660.6 | 729.2 |
| 33. | హైదరాబాద్ | - | - | 734.8 | 878.1 |
| | **మొత్తం / వర్షపాతం సగటు** | **63,54,286** | **2,21,094** | **836.7** | **1032.9** |

**గమనిక:** 'వ్యవసాయ పాడిపంటలు' పత్రిక సాఫ్ట్ కాపీని http://vyavasayam.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి, https://agri.telangana.gov.in/ వెబ్‌సైట్ నుంచిడౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సంపాదకులు



# సంపాదకీయం

## 'రైతునేస్తం' కార్యక్రమంలో పాల్గొందాం..
## సాగును మరింత మెరుగుపరుచుకుందాం..

వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆరుగాలం శ్రమిస్తూ, దేశానికి అన్నాన్ని ఇతర అవసరాలను అందిస్తున్న రైతాంగానికి ఎప్పటికప్పుడు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలను అందించడమే ధ్యేయంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎలక్ట్రానిక్ వింగ్ వారు రూపొందించిన సరికొత్త డిజిటల్ వ్యవసాయ విస్తరణ మాధ్యమానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం సహకారం అందిస్తోంది.

ఈ డిజిటల్ మాధ్యమం ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులతో నేరుగా మాట్లాడి, చర్చించి, క్షేత్ర స్థాయిలో రైతాంగ సమస్యలకు తక్షణంగా పరిష్కారాలు సూచిస్తున్నారు. ఈ సౌకర్యాన్ని రైతునేస్తం పేరిట 2024 మార్చి 06న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించగా, కార్యక్రమానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు, అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రతి మంగళవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహిస్తారు. ఇప్పటికే 566 రైతువేదికల్లో ఏర్పాటు చేసిన దృశ్య శ్రవణ పరికరాల ద్వారా రైతునేస్తం కార్యక్రమం 31 వారాలు జరిగింది. 3,08,078 మంది రైతులకు (58,879 మహిళా రైతులు సహా) అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవసరమైన పంటలు, వాతావరణ ఆధారిత సలహాలు అందిస్తారు. రైతునేస్తం ముఖ్య ఉద్దేశం శాస్త్రవేత్తలు – అధికారులు – రైతులను రైతువేదికల ద్వారా క్షేత్ర స్థాయితో అనుసంధానించడం. తద్వారా ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సమస్యలను చర్చించి, సలహాలు, సూచనలు అందించడం. గ్రామ స్థాయి, మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులకు వారు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందిస్తారు.

ఈ కార్యక్రమాన్ని రైతులు, క్షేత్ర స్థాయి అధికారులు సద్వినియోగం చేసుకుని, వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తారని, ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచుతారని ఆశిద్దాం..





# నవంబర్ మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ

**వరి :** వానాకాలంలో ముందుగా వరి నాట్లు వేసిన కొన్ని జిల్లాల్లో వరి కోతలు ఇప్పటికే పూర్తి అవుతున్నాయి. అలాగే మిగతా జిల్లాల్లో వరి పైర్లు గింజ పాలు పోసుకొనే దశ నుండి గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ వానాకాలంలో సాగుచేసిన వరి పంటలో కొన్ని ప్రాంతాలు మినహా (కాండం తొలిచే పురుగు, ఎండాకు తెగులు) చీడపీడల ఉధృతి కొంత మేరకు అదుపులో ఉన్నది. కాకపోతే ఆలస్యంగా వేసిన వరి పంటలో నవంబర్ మాసంలో ఉండే వాతావరణ పరిస్థితుల్లో మెడ విరుపు తెగులు, గింజ నల్ల మచ్చ తెగులు, సుడిదోమ, కంకినల్లి ఆశించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ వానాకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా కాండం తొలిచే పురుగు ఆశించడం వలన తెల్ల కంకులు ఏర్పడ్డాయి.

- అయితే **గింజ పాలుపోసుకొనే దశలో తెల్ల కంకులు గమనించినప్పుడు ఎలాంటి పురుగు మందులు కొట్టడం వలన ప్రయోజనం ఉండదని రైతులు గమనించాలి.** అలాగే సుడిదోమ, మెడ విరుపు తెగులు, పాముపొడ తెగులు, కంకినల్లి, గింజ నల్లమచ్చ తెగుళ్ళ నివారణకు సిఫారసు చేయబడిన మందులను మాత్రమే వాడాలి
- .రైతులు క్రమం తప్పకుండా పొలంలోను గట్ల వెంబడి తిరుగుతూ పురుగులు, తెగుళ్ళ ఉధృతిని గమనిస్తూ ఉండాలి. నష్టపరిమితి స్థాయి దాటే పరిస్థితుల్లోనే మందులు పిచికారీ చేసుకోవాలి. తప్పకుండా సమగ్ర సస్యరక్షణ పద్ధతిలోనే పురుగులు/తెగుళ్ళ నివారణ చేయడం వలన ఖర్చు, వాతావరణ, ఆహార కాలుష్యం తగ్గుతుంది.
- ముఖ్యంగా వానాకాలం వరిలో సుడిదోమ నివారణకు పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.48 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్+ ఎథిప్రోల్ 0.25 గ్రా. లేదా డైనోటెప్యూరాన్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అలాగే గింజ నల్ల మచ్చ, కంకినల్లి గమనించినప్పుడు స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. + ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వీటితో పాటుగా అగ్గితెగులు కూడా తొలిదశలో గుర్తించినట్లయితే స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. టెబ్యుకొనజోల్+ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 0.4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఎక్కడైతే పాముపొడ తెగులు ఉధృతి అధికంగా ఉంటే తైఫ్లూజమైడ్ 0.75 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వరి కోత, నూర్పిడి సమయంలో ధాన్యంలో తేమ శాతం 23-26% వరకు ఉంటుంది. కోసిన వెంటనే ధాన్యాన్ని టార్పలిన్ లేదా ప్లాస్టిక్ పట్టాలపై పలుచగా ఆరబెడితే గింజ రంగు మారకుండా మంచి నాణ్యతగా ఉంటుంది. కావున ధాన్యానికి మంచి మార్కెట్ విలువ రావడానికి నిర్దేశించిన ప్రమాణాలు ఉండేటట్లు చూడాలి.



- యాసంగిలో ముఖ్యంగా నీటి లభ్యతను బట్టి వరిని సాగు చేయాలి. అలాగే వరి తర్వాత వరి వరుసగా సాగు చేయడం వలన ఇబ్బందులు తప్పవని రైతాంగం గుర్తించుకోవాలి. బోర్లు/బావుల, చెరువుల కింద అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసి యాసంగిలో వరిసాగు చేపట్టాలి. ముఖ్యంగా ఈ యాసంగిలో స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలైన జగిత్యాల రైస్-1, కూనారం సన్నాలు, ఆర్ఎన్ఆర్-29325, ఎంటియు 1010, తెల్లహంస వంటి రకాలను సాగు చేయాలి. అలాగే సన్నగింజ రకాలైన తెలంగాణ సోన, కెఎన్ఎం 1638, కెఎన్ఎం 733, డబ్ల్యుజిఎల్-962, జగిత్యాల సాంబ, జెజిఎల్ 27356, ఆర్ఎన్ఆర్ 21278 వంటి రకాలను సాగు చేయాలి.
- వానాకాలంలో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేయాలనుకున్నట్లయితే ఆయా రకాల నిద్రావస్థను బట్టి నత్రికామ్లం కలిపిన ద్రావణంలో నానబెట్టి తదుపరి శుభ్రంగా కడిగి మండె కట్టాలి.
- విత్తనశుద్ధి కోసం కిలో విత్తనానికి కార్బండాజిమ్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి 24 గంటలు నానబెట్టి తర్వాత మండె కట్టాలి.
- సాధారణంగా యాసంగిలో చలి వలన నార్లు ఎదగకపోవడం, జింకు లోపం, వేర్లు నల్లగా అవటం ఎక్కువగా గమనించే అవకాశం ఉంటుంది. కావున జింకు లోప సవరణకు జింక్ సల్ఫేట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నార్లు ఎదగడానికి కార్బండజిమ్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. ఒక కిలో యూరియాతో కలిపి చల్లాలి.
- ప్రభుత్వం సన్నగింజ రకాలకు క్వింటాలుకు రూ. 500/- బోనస్ ప్రకటించింది. పొట్టు ఒలిచిన గింజ పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. మించకుండా ఉండి, గింజ పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5 కంటే ఎక్కువ ఉన్నట్లైతేనే ఆ ధాన్యం సన్నరకంగా గుర్తించి కొనుగోలు చేస్తారు.

**మొక్కజొన్న :** మొక్కజొన్న పంటను యాసంగిలో నవంబరు 15 లోగా విత్తుకుంటే అధికదిగుబడులు పొందవచ్చు. అందుకోసం ఎకరాకు 8 కిలోల ధృవీకరించిన విత్తనాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి సేకరించి విత్తుకోవాలి. సేకరించిన విత్తనాలు విత్తనశుద్ధి కానివి అయితే ఒక కిలో విత్తనానికి 6.0 మి.లీ సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. దుక్కి చేసిన నేలలో 60 సెం.మీ. ఎడం ఉండునట్లు బోదెలు చేసుకోవాలి. విత్తనాన్ని బోదెకు ఒక వైపున పైనుండి 1/3 వ వంతు ఎత్తులో 20 సెం.మీ. దూరంలో విత్తాలి. ఆ విధంగా ఎకరాకు 33333 మొక్కల సాంద్రత ఉండేటట్లుగా చూసుకోవాలి. విత్తిన వెంటనే నీటి తడిని ఇవ్వాలి.

- విత్తిన 48 గంటలలోపు అట్రాజిన్ అనే కలుపు మందును తేలిక నేలల్లో ఎకరాకు 800 గ్రా., బరువు నేలల్లో 1200 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఆ తర్వాత 25-30 రోజులకు కలుపు ఉధృతిని బట టెంబోట్రియోన్ 34.4% ఎస్.సి. ద్రావణాన్ని 115 మి.లీ. లేదా హెలోసల్ఫ్యూరాన్ మిథైల్ 75 డబ్ల్యూజి 36 గ్రా. లేదా టోప్రామిజోన్ 33.6% ఎస్.సి. 40 మి.లీ. 200 లీ. నీటిలో కలిపి కలుపు 4-5 ఆకుల దశలో పిచికారీ చేసినట్లయితే వివిధ రకాల కలుపు మొక్కలను నియంత్రించవచ్చు.
- యాసంగిలో ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్‌నిచ్చే

ఎరువులను వేసుకోవాలి. విత్తేటప్పుడు 1/4వ వంతు నత్రజని ఎరువును, మొత్తం భాస్వరం ఎరువును వేయాలి. పొటాష్ ఎరువును బరువు నేలల్లో అయితే మొత్తం ఆఖరి దుక్కిలోను అదే తేలిక నేలల్లో అయితే మొదటి సగం విత్తే సమయంలో మిగతా పూత దశలో వేయాలి. పైపాటుగా మిగతా నత్రజనిని 1/4వ వంతు 20 రోజులకు 1/4వ వంతు 40 రోజులకు, 1/4వ వంతు 60 రోజులకు వేయాలి. ఎరువులను వేసిన ప్రతిసారి నీటి తడులను తప్పని సరిగా ఇవ్వాలి.

**చిరుధాన్యాలు :**

**యాసంగి జొన్న:** యాసంగి జొన్న అక్టోబర్ రెండవ వారం నుండి నవంబర్ రెండవ వారం వరకు విత్తుకోవచ్చు. తాండూరు జొన్న 1 (ఎస్.వి.టి. 68), తాండూరు జొన్న 55 (ఎస్.వి.టి. 55), సి. ఎస్.వి 29 ఆర్ అనే మేలైన రకాలను ఎంచుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 12 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవడం వల్ల విత్తిన నెల రోజులలోపు వచ్చే మొవ్వు తొలిచే ఈగ నుండి పంటను కాపాడుకోవచ్చు.

**సజ్జ:** ఈ పంటను అక్టోబర్ రెండవ వారం నుండి నవంబరు చివరి వారం వరకు విత్తుకోవచ్చు. ఎకరాకు రెండు కిలోల విత్తనం సరిపోతుంది. తెగుళ్ళు ఆశించకుండా కిలో విత్తనానికి 6 గ్రా. మెటలాక్సిల్ 35 డబ్ల్యు.యస్. కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అక్టోబరులో విత్తుకున్న పంట మూడు నుంచి నాలుగు వారాల దశలో ఉన్నట్లైతే గుంటక లేదా దంతితో వరుసల మధ్య అంతర సేద్యం చేయాలి. ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి. నత్రజనిని యూరియా రూపంలో ఎకరాకు 25-30 కిలోల చొప్పున పై పాటుగా వేయాలి.

**రాగి:** ఈ పంటను అక్టోబర్ చివరి వారం నుండి నవంబరు చివరి వారం వరకు విత్తుకోవచ్చు. ఎకరాకు రెండు కిలోల విత్తనం సరిపోతుంది. నారు పెంచి లేదా నేరుగా విత్తుకోవచ్చు. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

**వేరుశనగ :** వానాకాలంలో విత్తుకున్న పంట కోతదశకు వచ్చింది. 75% కాయలు పక్వానికి వచ్చినప్పుడు పంటకోత చేపట్టాలి. పంటకోత కోసం డిగ్గర్‌ను వాడవచ్చు, త్రెషర్ యంత్రాలను వాడుకొని గంటకు 2-2.5 క్వింటాళ్ళ చొప్పున మొక్క నుండి కాయలను వేరుచేయవచ్చు. దీని వల్ల కూలీల కొరత గణనీయంగా తగ్గుతుంది. యాసంగి పంటను నవంబర్ రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 70-80 కిలోల విత్తనం అవసరం అవుతుంది. వేరుశనగ పంట తెగుళ్ళ బారిన పడకుండా ఒక కిలో విత్తనానికి 1 గ్రా. టెబ్యుకొనజోల్ కలిపి విత్తుకోవాలి. కొత్తగా వేరుశనగ విత్తుకునే భూములలో ఒక ఎకరానికి సరిపడా విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను కలిపి విత్తుకోవాలి.

- ❖ యాసంగిలో విత్తుకునేటప్పుడు వరుసల మధ్య 22.5 సెం.మీ., వరుసలలోని మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం పాటించి విత్తుకోవాలి. ఆఖరి దుక్కిలో 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 18 కిలోల యూరియా, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లతో పాటు 3-4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలి. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలి. విత్తిన తరువాత 48 గంటలలోపు తడినేలపై డైక్లోసులామ్ అనే కలుపు మందును ఎకరానికి 12.4 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ❖ విత్తిన తరువాత 20-25 రోజుల వరకు నీటి తడిని ఇవ్వకూడదు. తద్వారా తదుపరి ఇచ్చే తడితో ఒకేసారి పూత ఎక్కువగా వచ్చి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

- అక్టోబర్ మాసంలో విత్తుకున్న పంట తొలి దశలో ఉంటుంది. దీనికి పైపాటుగా 10-15 కిలోల యూరియా వేయాలి. పంట 45 రోజుల దశలో ఉన్నట్లైతే 200 కిలోల జిప్సంను సాళ్ళలో వేసి మట్టిని ఎగదోయాలి. పురుగు, తెగుళ్ళను సమయానుసారంగా గమనించి సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులు చేపట్టాలి.

**ఆముదం :** వానాకాలంలో విత్తుకున్న పంట ప్రస్తుతం మొదటి, రెండవ కోత దశలో ఉంది. యాసంగిలో విత్తుకున్న పంట నెల రోజుల వయస్సులో ఉంటుంది. కాబట్టి అంతరకృషి చేసుకుని మొదటి 40-60 రోజుల వరకు కలుపును నియంత్రించాలి. మొలక కుళ్ళు తెగులు గమనించినట్లైతే వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళలో పోసుకోవాలి. పొగాకు లద్దె పురుగు, దాసరి పురుగు ఆశించిన ఆకులను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతిని బట్టి వేపనూనె 5 మి.లీ. లేదా పంటలో కాయతొలిచే పురుగు ఉధృతి గమనించినట్లైతే నొవాల్యురాన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

- ఆగష్టు నెలలో విత్తుకున్న పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. 75% కాయలు పక్వానికి రాగానే కోతను చేపట్టాలి. కట్టలుగా కట్టి పొలంలో తలకిందులుగా నిలబెట్టాలి. 5-6 రోజులు ఆరిన వెంటనే కట్టలను కర్రలతో కొట్టి పంట మార్పిడి చేసుకోవాలి.

**కుసుమ :** ఈ పంటను యాసంగిలో మొక్కజొన్న, వేరుశనగ పంటలకు ప్రత్యామ్నాయంగా అక్టోబర్ రెండవ పక్షం నుండి నవంబర్ మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 4 కిలోల విత్తనం అవసరం అవుతుంది. కాప్టాన్ 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసల మధ్య 45 సెం.మీ. మొక్కల మధ్య 20 సెం.మీ. ఎడం ఉండేలా చూసుకోవాలి. దుక్కిలో 10-12 కిలోల యూరియా, 70 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేసుకోవాలి. విత్తిన 30-40 రోజుల మధ్య యూరియా 10-12 కిలోలు పైపాటుగా వేసుకోవాలి. విత్తిన 20-35 రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా చూసుకోవాలి. పంట తొలి దశలో పేనుబంక ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒత్తుగా ఉన్న మొక్కలను పీకి పలుచగా చేసుకోవాలి.

**పొద్దుతిరుగుడు :** వానాకాలంలో విత్తుకున్న పంట కోత దశకు వస్తుంది. పువ్వు వెనుక భాగం పసుపు పచ్చగా మారినప్పుడు పువ్వులను కోసి 2-3 రోజులు ఆరబెట్టాలి. గింజలలో తేమ 9% వచ్చినప్పుడు నూర్పిడి చేసుకోవాలి. యాసంగిలో ఈ పంటను నవంబర్- డిసెంబర్ మాసం వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 2.5-3 కిలోల విత్తనం సరిపోతుంది. ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకున్నట్లైతే నెక్రోసిస్ వైరస్ తెగులు రాకుండా చూసుకోవచ్చు. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు రాకుండా కిలో విత్తనానికి ఇప్రోడియాన్ 25% + మ్యాంకోజెబ్ 25% 2 గ్రా. కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

- ఆఖరి దుక్కిలో 2-3 టన్నుల పశువుల ఎరువు వేయాలి. పంట మొత్తానికి నత్రజని 30 కిలోలు, భాస్వరం 36 కిలోలు, పొటాష్ 12 కిలోలు ఎకరానికి అవసరం. సగం నత్రజని ఎరువును ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. విత్తనాన్ని బోదెలు-సాళ్ళ పద్ధతిలో నాటుకోవాలి. 50-55 కిలోల జిప్సంను ఆఖరి దుక్కిలో వేసుకున్నట్లైతే పంట నాణ్యత బాగుంటుంది. విత్తిన 48 గంటల్లో పెండిమిథాలిన్ 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి తడి నేలపై పిచికారీ చేసి తొలిదశలో వచ్చే

కలుపును నివారించాలి. నేల స్వభావం, ఉష్ణోగ్రతలను అనుసరించి ఎర్రనేలల్లో 8-10 రోజులకు నల్లరేగడి నేలల్లో 15-20 రోజులకొకసారి నీటి తడులను ఇవ్వాలి.

**సోయాచిక్కుడు :** సోయాచిక్కుడు ప్రస్తుతం కోత దశ నుండి నూర్పిడి దశలో ఉంది. స్వల్పకాలిక రకాలు, మధ్యస్థ కాలపరిమితి గల రకాలు నూర్పిడి అయిపోయి ఆరబెట్టే దశలో ఉన్నాయి.

- ❖ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వల్ల పంట తడవకుండా టార్పలిన్ షీట్లను పంట మీద కప్పి ఉంచాలి.
- ❖ పంటను 8-10% శాతం వచ్చే వరకు ఎండలో ఆరబెట్టాలి. పంటను మార్కెట్‌కు తీసుకువచ్చే ముందు రైతుస్థాయిలో జల్లెడ పట్టుకున్నట్లైతే అధిక ధరను పొందవచ్చు.
- ❖ పంటను పాలిథీన్ లేదా గోనె సంచులలో నిలువచేసుకోవాలి. విత్తనోత్పత్తి చేసే రైతులు ఒక వరుసలో 5-7 సంచుల కంటే ఎక్కువ ఎత్తు వేయకూడదు. అలాగే తప్పనిసరిగా కర్ర దుంగలను అడుగున వేసి నిల్వచేయాలి.
- ❖ విత్తన ధృవీకరణ సంస్థ ప్రమాణాల ప్రకారం తాలు గింజలు, చెత్త, ఇతర పంటల అవశేషాలు లేకుండా చూసుకోవాలి.
- ❖ అలాగే విత్తన మొలక శాతాన్ని క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. 80% కంటే ఎక్కువ మొలక శాతం ఉన్నట్లైతే ఏదైనా ఒక శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేసుకున్నట్లైతే నిల్వ సమయంలో మొలక శాతం పడిపోకుండా ఉంటుంది.

**అపరాలు :**

**పెసర / మినుము:** అక్టోబర్ నెలలో పంట మొగ్గ, పూత దశలో ఉన్నది. మొగ్గ దశలో ఉన్నచో తేలికపాటి తడి ఇస్తే సమంగా పూతకు వచ్చి పిందె బాగా నిలుస్తుంది. అధిక పగటి ఉష్ణోగ్రతల వలన రసం పీల్చే పురుగులు ముఖ్యంగా పేనుబంక ఆశిస్తుంది. పల్లాకు తెగులు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. తెల్లదోమ ఉనికిని తగ్గించడానికి పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి.

**అక్టోబర్‌లో విత్తిన మినుము, పెసర పైర్లలో యాజమాన్య పద్ధతులు:**

**తామరపురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకులలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేయటయే కాకుండా ఆకుముడత అనే వైరస్ వ్యాధిని వ్యాపింప చేస్తాయి. నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చటమే కాక పల్లాకు తెగులును కూడా వ్యాపింప చేస్తాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పేనుబంక:** ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కంది:** తొలకరిలో వేసిన, మధ్యకాలిక రకాలు పూత, పిందె దశలో ఉన్నాయి. పిందె దశలో ఉన్న పంటకు అవసరాన్ని బట్టి తేలికపాట తడి ఇస్తే దిగుబడి పెరుగుతుంది. ఆలస్యంగా విత్తిన కంది మొగ్గ నుండి తొలి పూత దశలో ఉన్నది. ఈ దశలో తేలికపాటి తడి ఇవ్వాలి. శనగపచ్చ పురుగు, మారుకా గూడు పురుగు నివారణకై క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తొలిదశ లార్వాలు సమర్థవంతంగా నివారించబడును. ఉధృతి ఎక్కువగా ఉన్నచో లేదా

బాగా ఎదిగిన లార్వాలు నివారించడానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**శనగ:** శనగ పంట అక్టోబర్ నుండి నవంబర్ మొదటి పక్షంలో విత్తితే పూత, పిందె దశలో బెట్ట పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రత సమస్య రాకుండా మంచి దిగుబడులు సాధించవచ్చును.

**అనువైన రకాలు:**

**దేశీ రకాలు:** జె.జి-11, ఎన్.బి.ఇ.జి-3, ఎన్.బి.ఇ.జి-47, ఎన్.బి.ఇ.జి-49, జె.ఎ.కె.ఐ-9218, నంద్యాల శనగ - 1, నంద్యాల శనగ-857 (ఎన్.బి.ఇ.జి-857), ఎన్.బి.ఇ.జి-452, ఎన్.బి.ఇ.జి-776, ఎన్.బి.ఇ.జి-1267

**కాబూలీ రకాలు:** ఐ.సి.సి.వి-2 (శ్వేత), కె.వి.కె-2, విహార్, పూలేజి-95311, ఎం.ఎన్.కె-1, ఎన్.బి.ఇ.జి-119, ఎన్.బి.ఇ.జి-810

**విత్తన మోతాదు:** శనగ రకాలలో విత్తన బరువును బట్టి ఎకరాకు వేసుకోవాల్సిన విత్తన మోతాదు మారుతుంది. దేశీ రకాలను ఎకరానికి 35 కిలోలు, కాబూలీ రకాలను 40-50 కిలోల చొప్పున విత్తుకోవాలి.

**విత్తే దూరం:** 30×10 సెం.మీ.

**విత్తనశుద్ధి:** శనగ విత్తనాన్ని విత్తే ముందు 3 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. థైరామ్ / కాప్టాన్ లేదా 1.5 గ్రా. టెబ్యుకొనజోల్, 1.0 గ్రా. ట్రైకోడెర్మా విరిడి ఒక కిలో విత్తనానికి చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల మొక్క తొలిదశలో ఆశించే (నేల, విత్తనం ద్వారా వచ్చే) తెగుళ్ళను అరికట్టవచ్చు. మొదట శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేసిన తరువాత ట్రైకోడర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి. శనగలో 20-25 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అంతరకృషి చేసి కలుపు నివారించాలి. తద్వారా తేమ కూడా ఎక్కువ రోజులు మొక్కకు అందేలా తోడ్పడుతుంది.. రబీలో విత్తిన శనగ పంటకు విత్తిన 35-40 రోజులకు, 55-65 రోజులకు తేలికపాటి నీటి తడి ఇస్తే దిగుబడులు పెరుగుతాయి. శనగలో మొగ్గదశలో 2% 20 గ్రా. లీటరు నీటికి డి.ఎ.పి లేదా యూరియా ద్రవణం పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది. ఆలస్యంగా విత్తిన శనగ పంట తొలిదశలో పచ్చ రబ్బరు పురుగు ఆశించి నష్టపరుస్తుంది. నివారణకై క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పత్తి :** రాష్ట్రంలో పత్తి రైతులు మొదటి తీత పత్తి తీసుకున్నారు. కొన్ని చోట్ల రెండవ తీత పత్తి కొనసాగుతోంది.

- పత్తి తీసేటప్పుడు గోనె లేదా గుడ్డ సంచులను వాడాలి. ఎండిన ఆకులు, కాయ తొడిమలు పత్తితో కలువకుండా చూసుకోవాలి.
- తీసిన పత్తిని పట్టాలపై నీడలో 8 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లయితే మార్కెట్‌లో మంచి ధర వస్తుంది.
- గులాబి రంగు పురుగు ఉధృతిని తగ్గించడానికి లింగాకర్షక బుట్టలు ఎకరానికి 8-10 చొప్పున పత్తి మొక్కకు అడుగు ఎత్తులో ఉండే విధంగా పెట్టుకోవాలి.
- గులాబి రంగు పురుగును పత్తి చేనులో గమనిస్తే లీటరు నీటికి సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా లామ్డా సైహాలోత్రిన్ + క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి.

❖ పత్తి కాయకుళ్ళు గమనించినట్లైతే లీటరు నీటికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 0.6 గ్రా. పిచికారీ చేసుకోవాలి.

❖ రాష్ట్రంలో పత్తి పంట రెండవ తీత (120-140 రోజులు) దశలో ఉంది. పైపాటుగా ఎటువంటి ఎరువులు గాని, పురుగు మందులుగాని వాడరాదు. పంటకాలంను పొడిగించరాదు.

**చెరకు :** మన రాష్ట్రంలో చెరకు కర్మాగారాలు నవంబర్ మాసంలో ప్రారంభించి ఏటా 35 లక్షల టన్నుల గానుగాడించి, 3.5 లక్షల టన్నుల పంచదారను ఉత్పత్తి చేస్తున్నాయి. గత సంవత్సరం మన రాష్ట్రం సరాసరి పంచదార రికవరీ శాతం 10.36 గా నమోదు చేసుకుంది. అయితే నాణ్యమైన పక్వం చెందిన చెరకును కర్మాగారాలకు సరఫరా చేస్తేనే అధిక రికవరీ సాధించి, ఎక్కువ పంచదార దిగుబడులను సాధించవచ్చును. చెరకు పక్వత, రసనాణ్యత వివిధ అంశాలు / పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

❖ దీర్ఘకాలిక రకాలు సాధారణంగా ఎక్కువ చెరకు దిగుబడులనిస్తాయి. కాని స్వల్పకాలిక రకాలు దీర్ఘకాలిక రకాలకన్నా ఎక్కువ పంచదార శాతాన్ని కలిగి ఉంటాయి. కాలమాన పరిస్థితులకు ఈ స్వల్పకాలిక రకాలు తట్టుకొని పంచదార దిగుబడులను తగ్గకుండా కాపాడుకుంటాయి. అందుకని ఎక్కువ మొత్తం విస్తీర్ణంలో దీర్ఘకాలిక రకాలను మాత్రమే సాగు చేయకుండా కొంత విస్తీర్ణం స్వల్పకాలిక రకాలకు కూడా కేటాయించడం వలన అధిక పంచదార దిగుబడులను పొందవచ్చును.

❖ చెరకు పంటలో ఆకులు పసుపు రంగుకు మారి, గడలు బాగా లావై, అక్కడక్కడ చిరు పగుళ్ళు ఏర్పడి, కన్నులు బాగా ఉబ్బినట్లుండటం, చిట్టచివర నాలుగైదు చెరకు ఖండాలు ఎదుగుదల తగ్గడం వంటివి ఉంటే చెరకు పక్వానికి వచ్చిందని నిర్ధారించుకోవచ్చు. ఇంతకంటే చెరకు పక్వతను బాగా గుర్తించాలంటే ఆ రసంలోని ఘనపదార్థ పరిమాణం సమానంగా ఉంటే ఆ తోట పక్వానికి వచ్చినట్లు నిర్ధారించుకోవచ్చు. ఉదాహరణకు కొన్ని చెరకు రకాలు (కో 6907, కో సి 671) ఏ సమయంలో నాటినప్పటికీ పది నెలల వయస్సు వచ్చేసరికి పక్వానికి వస్తాయి.

❖ పూత వచ్చిన నెల రోజుల తరువాత చెరకు నరికినట్లైతే అటు పంచదార రికవరీలోను, ఇటు చెరకు దిగుబడులలోను తరుగుదల ప్రభావం కనబడుతుంది. అందుకని చెరకులో పూత కనబడిన నెల రోజులలోపు చెరకు గడలను నరికి కర్మాగారాలకు పంపినట్లైతే దిగుబడిలో నష్టం తక్కువగా ఉంటుంది.

❖ మంచి నాణ్యమైన చెరకు పొందటానికి లోతైన దుక్కి అవసరం. పల్లపు భూముల్లో పెంచిన తోటలు తొందరగా పక్వానికి వస్తాయి, కాని దిగుబడుల నాణ్యత తొందరగా కోల్పోతాయి. ఇటువంటి తోటల్లో పండించిన చెరకును త్వరగా గానుగాడించవలసి వస్తుంది. బరువైన నేలల్లో పండించిన చెరకు రసంలో సున్నం, బూడిద అధికంగా ఉండి, భాస్వరం తక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో పెంచిన తోటల్లో రస నాణ్యత తక్కువగా ఉండి చెరకు ఉప్పగా ఉంటుంది. చెరకు పక్వానికి వచ్చేటప్పుడు నేలలో తేమ అధికంగా ఉన్నట్లైతే చెరకు తొందరగా పక్వానికి రాక, సేంద్రియ ఆమ్లములు ఎక్కువై, రసంలో పంచదార ఘనపదార్థములు తక్కువగా ఉంటాయి.

(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో..)



# వాతావరణం - పంటల పరిస్థితి

డా.పి.లీలా రాణి, ప్రధాన శాస్త్రవేత్త – హెడ్, డా.ఎస్.జి.మహాదేవప్ప, సీనియర్ శాస్త్రవేత్త
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్. 040-29556164

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు జూన్ 03 వ తేదీన ప్రవేశించి తొమిది రోజుల వ్యవధిలో అంటే జూన్ 12 వ తేదీ వరకు రాష్ట్రమంతటా విస్తరించాయి. రాష్ట్రంలో 01.06.2024 నుండి 30.09.2024 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 738.6 మి. మి. గాను 962.6 మి.మి అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (30 శాతం) నమోదయింది. నైరుతి రుతుపవనాలు భారత దేశం నుండి అక్టోబర్ 15వ తేదీన నిష్క్రమించాయి.

రాష్ట్రంలో 01.10.2024 నుండి 31.10.2024 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 89.2 మి. మి. గాను 64.8 మి.మి అనగా సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం (-27 శాతం) నమోదయింది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (30.10.2024) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) జొన్న - 0.66 శాతం (917), మొక్కజొన్న - 3.05 శాతం (17982), కంది - 3.26 శాతం (104), శనగ - 6.11 శాతం (20436), పెసర - 0.11 శాతం (25), మినుములు - 25.23 శాతం (12166), ఉలవలు - 4.42 శాతం (52), వేరుశనగ - 33.08 శాతం (86759), పొద్దుతిరుగుడు - 1.13 శాతం (257), కుసుమ - 8.18 శాతం (978) సాగు చేశారు. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 2.34 శాతం మేర పంటలు సాగుచేశారు. ఇందులో ఆహార పంటలు 0.34 శాతం, పప్పుదినుసులు 7.77 శాతం, నూనె గింజల పంటలు 24.66 శాతం సాగుచేశారు.

భారత దేశంలో అక్టోబర్ 2024 మాసంలో అధిక సగటు ఉష్ణోగ్రత (26.9 డిగ్రీ సెంటిగ్రేడ్) నమోదయింది. ఇది గడిచిన 1901 సంవత్సరం నుండి అక్టోబర్ మాసపు సాధారణ సగటు ఉష్ణోగ్రత 25.69 డిగ్రీ సెంటిగ్రేడ్ కంటే అధికంగా నమోదయింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం, నవంబర్ మాసంలో భారత దేశంలో సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. రాష్ట్రంలో నవంబర్ మాసంలో ఉత్తర, ఈశాన్య, తూర్పు జిల్లాలలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు మిగిలిన ప్రాంతాలలో సాధారణం కంటే తక్కువ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు :

- కుసుమ, శనగ, ఆవాలు పంటలను నవంబర్ 15వ తేదీ వరకు, వేరుశనగ, బొబ్బర్లు పంటలను నవంబర్ 30వ తేదీ వరకు, మినుములు, పెసర పంటలను డిసెంబర్ 10వ తేదీ వరకు, మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటలను డిసెంబర్ 31వ తేదీ వరకు నాణ్యమైన విత్తనాన్ని వినియోగించుకొని విత్తుకోగలరు.

- యాసంగి వరి నారుమళ్ళను నవంబర్ 15వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ మధ్యలో పోసుకోవాలి.
- వరిలో మెడవిరుపు తెగులు నివారణకు 2.5 గ్రా. ట్రైసైక్లోజోల్ + మాంకోజెబ్ లేదా 1.6 మి.లీ. ఐసోప్రోథయోలేన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లయితే 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ లేదా 0.4 గ్రా. టెబుకోనజోల్ + ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యు జి లేదా 2 మి.లీ. పికాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ లేదా 1 మి.లీ. ఆజాక్సీస్ట్రోబిన్ + డైఫెన్ కొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో కంకినల్లి నివారణకు 1 మి.లీ. స్పైరోమేసిఫిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో గింజమచ్చ తెగులు నివారణకు 1మి.లీ. ప్రోపికొనజోల్ + 1మి.లీ. స్పైరోమేసిఫిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు, పొలంనుండి గుడ్డి పురుగులను ఏరి నాశనం చేయాలి. 2మి.లీ. క్వినాల్ ఫాస్ లేదా 1.5గ్రా. థయోడికార్బ్ లేదా 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ లేదా 0.4 గ్రా. ఇమమేక్టిన్ బెంజోయేట్ మందును లీటరు నీటికి కలిపి వారం నుండి 10 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.
- కంది పంటలో ఆకుచుట్టు పురుగు గమనిస్తే, నివారణకు 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వేరుశనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు, జల్లెడ ఆకులు ఏరి పురుగులను నాశనం చేయాలి. ఎకరానికి 10-15పక్షి స్థావరాలను ఏర్పర్చుకోవాలి. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి. ఎదిగిన లార్వా నివారణకు 1మి.లీ. నోవాల్యూరాన్ లేదా 0.2మి.లీ. ఫ్లూబెండమైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వేరుశనగలో తిక్కాఆకుమచ్చ తెగులు నివారణకు 1.0 మి.లీ. టెబ్యుకోనజోల్ లేదా 2 గ్రా. క్లోరోథాలోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వంగలో కొమ్మ, కాయతొలిచే పురుగు నివారణకు, పురుగు సోకిన కొమ్మలను తుంచి నాశనం చేయాలి, 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- కూరగాయ పంటలలో రసంపీల్చే పురుగుల నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మిరపలో కోయినోఫొర కొమ్మకుళ్ళు తెగులు నివారణకు, 3 గ్రా. పైరాక్లోస్ట్రోబిన్ + మెటిరామ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మిరపలో పొగాకు లద్దె పురుగు నివారణకు, 1.25 మి.లీ. నోవాల్యూరాన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- బత్తాయిలో ఆకుముడత పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా నివారణకు, 5మి.లీ. వేపనూనెను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు 1.5మి.లీ. ప్రొఫెనోఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- బత్తాయిలో గజ్జి తెగులు నివారణకు, తెగులు సోకిన కొమ్మలను, ఆకులను కత్తిరించి కాల్చివేసిన తరువాత 30 గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ + 1గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ పది లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

# రైతు స్థాయిలో సజ్జ పంటలో మెళకువలు

హిమబిందు పెలపూడి, సుమాలిని, దివ్య కరపాటి, పి.జె.టి.ఎస్.ఎ.యు. రాజేంద్రనగర్.

సజ్జ పంట మెట్ట ప్రాంత సాగుకు అనుకూలమైన చిరుధాన్యపు పంట. దీనిని పసుగ్రాసపు పంటగా కూడా చాలా మంది రైతులు సాగు చేస్తున్నారు. సజ్జ పంట అన్ని ఆహార పంటలలోకి ఎక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకొని, అతి తక్కువ పెట్టుబడితో సాగు చేపట్టవచ్చు. సజ్జ పంట వర్షాధార ప్రాంతాలలో, ఉష్ణ ప్రదేశాలలో భూసారం తక్కువగా ఉన్న భూముల్లో, నీటి నిల్వ శక్తిని తక్కువగా కలిగి ఉన్న భూముల్లో కూడా సాగు చేయటానికి అనుకూలంగా ఉంటుంది. అత్యధిక పోషక విలువలను కలిగి ఉండి, అత్యధిక శక్తిని ఇవ్వగల ఆహార ధాన్యపు పంట.

**విత్తే సమయం :** వానాకాలం – జూన్ జూలై, వేసవి : జనవరి

**నేలలు :** తేలిక నుండి మధ్యరకం నేలలు. నీరు ఇంకే, మురుగు నీటి పారుదల గల నేలలు అనుకూలం.

**విత్తనం :** ఎకరాకు 16 కిలోలు.

**విత్తన శుద్ధి :** 2% (20 గ్రా./లీ.) ఉప్పునీటి ద్రావణంలో విత్తనాలను 10 ని.లు ఉంచటం ద్వారా ఎర్గాట్ శిలీంధ్ర అవశేషాలను తేలేటట్లు చేసి తొలగించవచ్చు. ఆరిన కిలో విత్తనానికి 6 గ్రాముల మెటాలాక్సిల్ 35 డబ్ల్యూ. ఎస్. మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**విత్తే దూరం :** వరుసల మధ్య 45 సెం.మీ., మొక్కల మధ్య 12 నుండి 15 సెం. మీ. దూరం ఉండేట్లు గొర్రుతో విత్తుకోవాలి.

**నాటటం :** నారుపోసి, 15 రోజుల వయసుగల నారు మొక్కలను పైన తెల్పిన దూరంలో నాటవచ్చు. ఎకరాకు 58,000 – 72,000 మొక్కలు నాటుకోవాలి.

**ఎరువులు :** ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. ఎకరాకు నీటిపారుదల పంటకు 32 కి. + 16 కి. + 12 కి. వర్షాధార పంటకు 24 కి. + 12 కి. + 8 కి. వంతున నత్రజని + భాస్వరం + పొటాష్ నిచ్చే ఎరువులను వేయాలి. నత్రజనిని విత్తేటప్పుడు సగం, విత్తిన 30 రోజులకు మరో సగం వేయాలి.

**నీటి యాజమాన్యం :** మొక్కలకు 30 రోజుల వయసులో ఎకరాకు 2 టన్నుల వేరుశనగ పొట్టు నేల మీద పరచడంద్వారా భూమిలోని తేమ ఆవిరి కాకుండా కాపాడవచ్చు. అంకురదశ, పూతదశ, గింజపాలు పోసుకొనే దశ, గింజ గట్టిపడే దశల్లో నీటి తడులివ్వాలి.

**కలుపు నివారణ, అంతర కృషి:** విత్తిన రెండు రోజులలోపు అట్రాజిన్ 50% డబ్ల్యూ. పి. కలుపు మందును 4 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి తడినేలపై పిచికారీ చేయాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. 25-30 రోజులప్పుడు దంతితో అంతరకృషి చేయాలి.

**సస్యరక్షణ :**

**కత్తెర పురుగు :** ఈ పురుగును నివారించడానికి గుడ్ల సముదాయాలను ఏరి నాశనం చేయాలి. పిల్ల పురుగులతో ఉన్న ఆకులను ఏరి నాశనం చేయాలి. ఎకరానికి 10 లింగాకర్షక బుట్టలను ఏర్పరచుకొని నివారించుకోవాలి. పురుగు గుడ్లను, మొదటి దశ పిల్ల పురుగులను నివారించడానికి 5% (5 మి.లీ./లీ.) వేప నూనెను (1000 పి.పి.ఎం.) పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.జి. 80 గ్రా. లేదా స్పైనోశాడ్ 45 ఎస్.ఇ. 60మి.లీ. లను 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. మందులు పిచికారీ చేసేటప్పుడు పైపైనే కాకుండా సుడులలో/మొవ్వలోనికి ఆకులు పూర్తిగా తడిచేవిధంగా పిచికారీ చేయాలి.

**మొవ్వు ఈగ :** దీని నివారణకు పంటను వానాకాలంలో జూలై 15 లోపు విత్తుకోవాలి. ఆలస్యంగా విత్తనం వేయవల్సి వస్తే విత్తన మోతాదును 4 నుండి 10 కిలోలకు పెంచి మొవ్వ ఈగ ఆశించిన మొక్కలను

తీసివేయాలి. ఈ పురుగును నివారించుకోవడానికి విత్తేముందు 10 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ 70% డబ్ల్యు. ఎస్. మందును కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3% సి.జి. గుళికలు విత్తేటప్పుడు సాళ్ళలో వేయాలి. మొక్క మొలిచిన 7, 14, 21 రోజులకు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా లామ్డా సైహలోత్రిన్ 5% 2మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కాండం తొలిచే పురుగు :** దీని నివారణకు ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 1 ట్రైకోకార్డ్లు రెండు విడతలుగా విడుదల చేయాలి. విత్తిన 35-40 రోజులలోపు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3% సి.జి. గుళికలను కాండపు సుడుల్లో వేయాలి.

**గులాబి రంగు కాయ తొలిచే పురుగు:** దీని నివారణకు ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 1 ట్రైకోకార్డ్లు రెండు విడతలుగా విడుదల చేయాలి. విత్తిన 35-40 రోజులలోపు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ 3% సి.జి. గుళికలు కాండపు సుడుల్లో వేయాలి.

**అగ్గి పురుగు :** దీని నివారణకు క్వినాల్ఫాస్ 25% ఇ.సి. 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

**పచ్చకంకి / వెర్రికంకి తెగులు:** దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రాముల మెటలాక్సిల్ 35 డబ్ల్యు. ఎస్. మందుతో విత్తన శుద్ధి చేయాలి. వ్యాధి సోకిన మొక్కలను ఏరి, కాల్చి వేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకిన మొక్కలు 5% మించి వున్నట్లయితే మెటలాక్సిల్ 31.8% ఇ.సి. మందు 1గ్రా. లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**తేనె బంక తెగులు :** దీని నివారణకు విత్తనాలను 2% (20గ్రా./లీ.) ఉప్పునీటి ద్రావణంతో శుద్ధి చేయాలి. ఈ తెగులు నివారణకు థైరమ్ 80% డబ్ల్యు.పి. లేదా కాప్టాన్ 75% డబ్ల్యు.ఎస్. 3 గ్రా. కిలో విత్తనానికి



చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి. పంటలో ఈ తెగులును గమనించినట్లయితే 1 గ్రా. కార్బండెజిమ్ 50% డబ్ల్యు. పి. లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ 75% డబ్ల్యు.పి. లేదా 2 గ్రా. థైరమ్ 80% డబ్ల్యు, పి. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50% డబ్ల్యు.పి. 2.5 గ్రా. మందును లీటరు నీటికి వంతున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు కంకులపై పిచికారీ చేయాలి.

**అగ్గి తెగులు :** కిలో విత్తనాలకు 3 గ్రా. థైరమ్ 80% డబ్ల్యు.పి. లేదా కాప్టాన్ 75% డబ్ల్యు.ఎస్. కలిపి శుద్ధి చేయాలి. లీటరు నీటికి 2 గ్రా. మాంకోజెబ్ 75% డబ్ల్యు. పి. లేదా 1 గ్రా. కార్బండెజిమ్ 50% డబ్ల్యు.పి. కలిపి పిచికారీ చేయాలి.

**పంట కోత :** సజ్జ పంటలో పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకి మొదట కోతకు వస్తుంది. కాబట్టి 2 లేక 3 దశల్లో కంకులు కోయాల్సి వస్తుంది. కోసిన కంకులను బాగా ఆరబెట్టి, నూర్పిడి చేసి నిల్వ చేయాలి.

# యాసంగిలో ఆవాల పంటఅధిక దిగుబడికి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు

ఎన్.సాయినాథ్, ఇ.రజనీకాంత్, డి.శ్రీలత, ఎన్.బలరాం, డి.పద్మజ, పి.రవి, డి.ఎ.రజనీదేవి, జి.శ్రీనివాస్
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పొలస, జగిత్యాల -505 529

ఆవాలు అనేది భారతదేశంలో అత్యంత ప్రాధాన్యమైన నూనె గింజ పంటలలో ఒకటి. యాసంగిలో, అంటే చలి కాలంలో ఇది విస్తృతంగా సాగు చేస్తారు. ఆవాలలో 37 నుంచి 42 శాతం నూనె ఉంటుంది. గత 2 నుంచి 3 సంవత్సరాల తరబడి ఆవాల పంట వేయడానికి ఉత్తర తెలంగాణలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీని వల్ల రైతులకు కింద తెలిపిన యాజమాన్యం పాటించినట్లయితే అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చు.

**ఆవాల సాగులో ఉపయోగాలు :**

- తక్కువ నీటి వనరులు, సులభ యాజమాన్య పద్ధతులతో మధ్య రకాలైన నేలల్లో కూడా మంచి దిగుబడులు పొందవచ్చు.
- స్వల్పకాలిక పంట.
- ఈ పంట విభిన్న అవసరాలకు ఉపయోగపడుతుంది - ముఖ్యంగా వంట నూనె, పశువులకు ఆహారం వంటి అవసరాలకు ఉపయోగపడుతుంది.
- తేనేటీగల పెంపకం కూడా చేయవచ్చు.
- మార్కెట్ లో మంచి విలువ ఉంటుంది.
- తక్కువ నీటి ఆవశ్యకత (80-240 మి. మీ.) సరిపోతుంది.

**వాతావరణం, నేలలు :** ఆవాలు చల్లని వాతావరణంలో చాలా బాగా పెరుగుతుంది, ఇది యాసంగికి అనువైనది. గరిష్టంగా 10 డిగ్రీల నుండి 25 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అనుకూలం. ఇది తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో కూడా బాగా పెరుగుతుంది.

**నేలలు :** మురుగు నీరు నిలువని తేమ నిలిచే తేలికైన నేలలు అనుకూలం. ఇసుక నేలలు, నల్లరేగడి నేలలు, బంక మట్టి నేలలు, మిశ్రమ నేలలు వంటి మధ్యస్థ, తేలికైన నేలలు ఈ పంటకు అనుకూలమైనవి. భూమి ఉదజని సూచిక 6.0 నుండి 7.5 మధ్యలో ఉండాలి. అతి ఉప్పుగల లేదా అమ్లగల నేలలలో పండించకూడదు.

**నేల తయారీ :** పంట మంచిగా మొలకెత్తడానికి నేలను సరిగా సిద్ధం చేయడం ముఖ్యం. లోతుగా దున్నడం ద్వారా భూమి గాలి బాగా చేరుతుంది, వేరు వ్యవస్థ పెరుగుదలకు సహాయపడుతుంది. పొడి దుక్కిలో విత్తనాలు బాగా మొలకెత్తుతాయి.

**విత్తన ఎంపిక :** సరైన విత్తన రకాలను ఎంచుకోవడం మంచి దిగుబడికి ప్రధాన భూమిక. వివిధ ప్రాంతాలకు అనుకూలంగా ఉన్న రకాలను ఎంచుకోవాలి.

**కొన్ని ప్రాచుర్యం పొందిన రకాలు:** మంచి దిగుబడుల కోసం డి.ఆర్.ఎం.ఆర్.ఐ.జె. 31, ఎన్.ఆర్.సి.హెచ్.ఓ. 101, పూస తారక్, పూస జగన్నాథ్, పూస అగ్రాని నుండి 120 రోజుల వ్యవధిలో ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ళ దిగుబడిని పొందవచ్చు.

అలాగే ప్రైవేటు రంగంలో శ్రద్ధ, కోరల్ 432 రకాలు కూడా ప్రసిద్ధి చెందినవి.

**పూసా బోల్డ్:** అధిక దిగుబడి ఇచ్చే రకం, 140-145 రోజుల్లో పండుతుంది.

**పూసా మస్టర్డ్ 21:** త్వరగా పండే రకం, 100-110 రోజుల్లో పండుతుంది.

**ఆర్‌హెచ్-30:** తెల్ల తుప్పు తెగులు, ఆల్టర్నేరియా బ్లైట్ వ్యాధులపై మోస్తరు నిరోధకత కలిగిన రకం.

**వరుణ :** వివిధ వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటుంది.

**విత్తనాలను వేయడం :** విత్తనాలను సరిగా వేయడం వల్ల పంట విస్తృతంగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. యాసంగి సీజన్‌లో ఆవాల పంటను అక్టోబర్ మధ్య నుండి నవంబర్ మొదటివారాల వరకువేయడం ఉత్తమం.

**విత్తన మోతాదు:** ఎకరానికి4-5 కిలోలువిత్తనానికి కనీసం 5 కిలోల ఇసుక కలిపి గొర్రు సహాయంతో

విత్తాలి. ఆలస్యంగా వేయాల్సిన సందర్భంలో6-7 కిలోలు విత్తనాలు వేయడం మంచిది.

**విత్తన శుద్ధి:** కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేయాలి లేదా విత్తనాలు కార్బెండజమ్ లేదా థైరంతో 2 గ్రా/కిలో విత్తనం శుద్ధి చేయడం వలన మట్టి ద్వారా కలిగే వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చు.

**విత్తనాల దూరం:** వరుసల మధ్య45 సెం.మీ, మొక్కల మధ్య15-20సెం.మీదూరం ఉంచాలి.

**ఎరువుల యాజమాన్యం :** భుసార పరీక్షల అనంతరం అవసరాన్ని బట్టి ఎరువులను వినియోగించడం క్షేమం. ఆవాల పంటకు సరైన పోషకాలు అందించడం వల్ల పంట దిగుబడి మెరుగుపడుతుంది.

**ఎరువు మోతాదు:** నత్రజని 24 కిలోలు, భాస్వరం 16 కిలోలు, పొటాషియం 16 కిలోల ఎరువులను ఒక ఎకరానికి వేసుకోవాలి. రెండవ దఫా నత్రజని ఎరువులను పూత వచ్చే ముందు (55 - 60 రోజుల) వేయాలి.

**సూక్ష్మపోషకాలు:** బోరాన్, సల్ఫర్ లాంటి సూక్ష్మపోషకాలు అవసరం. సల్ఫర్ 12కిలోలు/ఎకరాకు ఇవ్వడం ద్వారా నూనె శాతం పెరుగుతుంది.

**సేంద్రియ పదార్థాలు:** ఎకరాకు 2 నుండి 3 టన్నుల పశువుల ఎరువుని విత్తే ముందు వేసుకోవాలి. సేంద్రియఎరువుల ద్వారా భూమిలో నీరు, పోషకాలు మెరుగుపడతాయి.

**నీటి యాజమాన్యం :** ఆవాల పంట సాగుకు సుమారు 300 - 400 మి. మీ. నీరు అవసరమవుతుంది. యాసంగిలో నీరు సరఫరా సరిగా ఉండడం ద్వారా పంటపెరుగుదల బాగా ఉంటుంది.మొత్తంగా 3-4 సార్లు తడులు ఇచ్చి మంచి దిగుబడులు సాధించవచ్చు.

**కీలకమైన పెరుగుదల దశలు :**

- క్రౌన్ రూట్ ఆరంభ దశ (20-25 రోజుల వయస్సులో)
- కొమ్మలు ఏర్పడే దశ (30-40రోజుల వయస్సులో)
- పూత దశ (45-50 రోజుల వయస్సులో)
- కాయ ఏర్పడే దశ (60-80 రోజుల వయస్సులో)

**కలుపు నియంత్రణ :** మొక్కల పెరుగుదల దశలో పోషకాలు, నీరు,, సూర్యరశ్మి కోసం ఆవాల పంట, కలుపు పోటీ పడతాయి. కాబట్టి కలుపును క్రమంగా తొలగించడం చాలా ముఖ్యం.

**చేత్తో కలుపు తీసివేయడం:** సుమారు 25-30 రోజులకు ఒకసారి, 50-55 రోజులకు రెండవసారి కలుపును తీసివేయాలి.

**కలుపు మందు ఉపయోగం:** విత్తిన 48 గంటల లోపు ఆక్సాడయార్జిల్ అనే 6% ఇ.సి. కలుపు మందును ఎకరానికి 600 మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొలకెత్తిన 3 వారాల లోపు కుదురుకు ఒక మొక్క ఉండేలా మొక్కలను పలుచన చేయాలి. పైరు 30, 60 రోజుల దశలో వరుసల మధ్య అంతర సేద్యం చేయాలి.

**సస్య రక్షణ :** ఆవాల పంటకు కొన్ని ముఖ్యమైన కీటకాలు, వ్యాధులు ఉండటంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయి. ముఖ్యమైన కీటకాలు, వ్యాధులు:





# మిరపలో సస్యరక్షణ

డా.ఎం.సునీల్ కుమార్, డా.కె.రాజశేఖర్, డా.జి.శివచరణ్, డా.డి.మోహన్ దాస్, ఎ.పోశాద్రి, డా.వై.ప్రవీణ్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్.

మన రాష్ట్రంలో పత్తి తరువాత అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంట మిరప. తెలంగాణ రాష్ట్రంలో 2,77,610 లక్షల ఎకరాలలో మిరపను సాగు చేస్తూ 5.73 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి పొందుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్, మార్కెట్లో అధిక గిట్టుబాటు ధర లభించడం వలన మిరప సాగు విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది. మన రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాల్లో మిరపను పండిస్తున్నారు. నారుమడి దశ నుండి కోత వరకు పంట సాగులో ఎదురవుతున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పలు రకాల చీడపీడలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. పంట సంరక్షణలో భాగంగా అధిక మోతాదులో కాంప్లెక్స్ ఎరువులను అందించడం, విరివిగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం వలన పెట్టుబడి ఖర్చు పెరుగుతోంది. దీనివలన రైతులకు ఆర్థికంగా భారం పెరగటమే కాకుండా నాణ్యత, దిగుబడులు తగ్గుతున్నాయి. కావున మిరప పంటను ఆశించే చీడపీడలను సకాలంలో గుర్తించడం, వాటి వ్యాప్తికి గల కారణాలు, అనుకూల పరిస్థితులు వంటి విషయాలపై అవగాహన చాలా అవసరం. ప్రధానంగా రసం పీల్చే పురుగులు, పూత పురుగు, వేరు పురుగు , కాయ తొలిచే పురుగులు వివిధ దశల్లో మిరపను ఆశించి నష్టాన్ని కలుగజేస్తున్నాయి.

**రసం పీల్చే పురుగులు :** ఈ పురుగులు నారు మొలక నుండి కాయ కోత వరకు అన్ని దశల్లో మిరప పంటను ఆశిస్తాయి. నత్రజని సంబంధిత ఎరువులు అధిక మోతాదులో వాడినప్పుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది.

**తామర పురుగులు (పై ముడత):** తల్లి, పిల్లపురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు మెలి తిరిగి అంచుల వెంబడి పైకి ముడుచుకుంటాయి. అందువల్ల దీనిని పై ముడత అంటారు. ఆకులు,పిందెలు రాగి రంగులోకి మారి పూత, పిందె నిలిచిపోతుంది. తద్వారా దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

**నివారణ:**

- మిరప నాటే సమయంలో ఎకరానికి 100 కిలోల వేప పిండిని వేయాలి.
- ఇమిడాక్లోప్రిడ్ అనే మందును కిలో విత్తనానికి 8 గ్రాముల చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి.
- నాటిన 15 రోజులకు, 45 రోజులకు ఫిప్రోనిల్ 0.3 శాతం గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి.

**ఆఫిడ్స్:** పువ్వులు చిగురించే సమయంలో, గింజల దశలో ఆఫిడ్స్ పంటకు తీవ్ర నష్టం చేస్తాయి. ఇమిడాక్లోప్రిడ్ (17.8 ఎస్.ఎల్.) 0.3 మి.లీ/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**తెల్ల తుప్పు తెగులు :** ఈ వ్యాధి వల్ల ఆకులు, కాండం పై తెల్లని బుడిపెల్లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఈ తెగులు నివారణకు మెటలాక్సిల్ శిలీంధ్ర నాశిని 6 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. తెగులు సోకిన మొక్కలపై మెటలాక్సిల్ 2 గ్రా. లేదా ప్రోపికొనజోల్ 1 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**పంట కోత :** పంట పక్వానికి వచ్చినపుడు కాయలు పసుపు రంగుకు మారతాయి. మొక్కలను కోసి ఎండిన తర్వాత కర్రలతో కొట్టి విత్తనాన్ని కాయల నుంచి వేరుచేయాలి.

**కోత:** సుమారు110-140 రోజులు పెరిగిన తర్వాత కోతకు సిద్ధం అవుతుంది.

**తేమశాతం:** కోత తర్వాత సుమారు 8-9% తేమ శాతంతో గింజలను నిల్వలో ఉంచాలి.

**దిగుబడి:** ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ళు సాధించవచ్చు.



❖ ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్0.5 మి.లీ. లేదా ఫిప్రోనిల్2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్0.25 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

**నల్ల తామర పురుగులు :** ఈ పురుగులు గత 3-4 సంవత్సరాల నుంచి మిరప తోటలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. తల్లి, పిల్ల పురుగులు ఆకులు, పూత, కాయలను ఆశించి విపరీతంగా రసాన్ని పిలుస్తాయి. దాని వలన ఆకులు ముడుచుకోవడం, పూత వాడిపోవడం, కాయలు చిన్నవిగా ఉండి వంకర్లుతిరగటం జరుగుతోంది. ఈ పురుగుల ఉధృతి ఎక్కువైనప్పుడు దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి.

**నివారణ:**

❖ ఎకరానికి 30 చొప్పున నీలిరంగు జిగురు అట్టలను పెట్టాలి

❖ పురుగులను గమనించిన తొలి దశలో జీవ నియంత్రకాలైన బవేరియా బాసియానా 5 గ్రా. లేదా వర్టిసిల్లియం లెకాని 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ వేప నూనె (10000 పి.పి.ఎం.) 3 మి.లీ. లేదా కానుగ నూనె 3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ ఫిప్రోనిల్ + ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా సయాంట్రనిలిప్రోల్ 1.2 మి.లీ. లేదా ఫ్లుక్షామెటామిడే 0.8మి.లీ.లేదా బ్రోఫ్లానిలిడే 0.17 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి

**తెల్ల నల్లి పురుగులు (కింది ముడత) :** ఈ పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనబడతాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారుతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోయి లేత ఆకులు ముద్ద కడతాయి.

**నివారణ:**

❖ నివారణకు స్పైరోమెసిఫెన్ 0.5 మి.లీ. లేదా డైఫెంత్యురాన్ 0.8 గ్రా. లేదా ప్రోపర్ గెయిట్ 2.5 మి.లీ. చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలి.

❖ సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడరాదు.

**పేను బంక :** ఈ పురుగులు వాతావరణం మబ్బుగా ఉన్నప్పుడు ఎక్కువగా వృద్ధి చెందుతాయి. తదుపరి వర్షాలు కురిసినపుడు వీటి ఉధృతి తగ్గుతుంది. లేత ఆకుపచ్చ రంగులో ఉండే పిల్ల పురుగులు క్రమేపి మెరిసే నల్లని పెద్ద పురుగులుగా మారుతాయి. పేను బంక లేత కొమ్మల, ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు ఎండి మొక్క పెరుగుదల తగ్గుతుంది. ఈ పురుగులు విసర్జించే తీయని పదార్థం వల్ల చీమలు ఆకర్షించబడుతాయి. ఆకులు, కాండం, కాయలపై మసి తెగులు వ్యాపిస్తుంది. ఈ పురుగులు ఆశించిన ఆకులు మెలికలు తిరిగి మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడి తగ్గుతుంది.

**నివారణ:**

❖ నివారణకు ఫిప్రోనిల్ 2.0మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లేదా థయోమిథాక్సాం 0.2 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ ఈ పురుగుల సహజ శత్రువులైన బదనికలు, అక్షింతల పురుగులు తగిన సంఖ్యలో ఉన్నప్పుడు రసాయనిక మందులు వాడనవసరం లేదు.

**పూత పురుగు (మిడ్జ్ ఈగ) :** పూత పురుగు దోమ జాతికి చెందినది. దీని తల్లి పురుగులు గోధుమ రంగులో ఉండి చూడటానికి దోమల్లాగా ఉంటాయి. ఇవి మిరప పంట పై ముఖ్యంగా అండాశయం, పూతపెద్దగా ఉన్న రకాలపై, పూత, పిందె దశల్లో ఆశించి నష్టం కలుగజేస్తుంటాయి. తల్లి పురుగులు తమ గుడ్లను పూమొగ్గలపై పెడతాయి. ఆ తరువాత ఈ గుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులు అండాశయంలోనికి చొచ్చుకొని పోయి అక్కడే ఉండి తింటూ సూప్తావస్థదశను పుర్తిచేసుకుంటాయి. పురుగు సోకిన పూతలో అండాశయం తెల్లగా ఉబ్బుతుంది. అండాశయం తొలిచి చూస్తే ఈగ యొక్క పిల్ల పురుగులను, ప్యుపాలను గమనించవచ్చు. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే దాదాపు 40 శాతం వరకు మిరప పూత రాలిపోతుంది. ఈ పురుగు సోకితే పూత ఎండి రాలిపోవడం వల్ల కాయలు ఏర్పడవు. ఏర్పడిన కాయలు గిడసబారి ఆకృతి మారిపోయి వంకర్లు తిరిగి ఉండడం వల్ల నాణ్యత కోల్పోయి మార్కెట్లో సరైన ధర పలకదు.

**నివారణ:**

❖ నివారణకు వేప నూనె (10000 పి.పి.ఎం.) 3 మి.లీ.చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ కార్బోసల్ఫాన్ 2.0 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 0.6 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వేరు పురుగు :** వేరు పురుగు మిరప మొక్కలు నాటిన వెంటనే వేర్లను తిని నష్టపరుస్తుంది. ఈ మొక్కలు వడలి, ఎండిపోతాయి. ఈ పురుగు ఆశించిన మొక్కలను పీకినప్పుడు సులభంగా బయటకు వస్తాయి.

**నివారణ :**

❖ తల్లి పురుగు పేడలో గుడ్లు పెడుతుంది కాబట్టి బాగా చివికిన పశువుల ఎరువుని వాడాలి.

❖ వడలిన,ఎండిపోయిన మొక్కలను పీకి, పురుగును ఏరివేయాలి.

❖ మిరప నారును ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ., కార్బెండజిం 10 గ్రా.పది లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో 15 నిమిషాల పాటు ముంచిన తర్వాత నాటుకోవాలి.

❖ ఎకరానికి 13 కిలోల కార్బోఫ్యురాన్ 3 శాతం గుళికలను వేసుకోవాలి.

**కాయ తొలిచే పురుగులు :** మిరప పంటలో కాయ తొలిచే పురుగులైన పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు, పచ్చ రబ్బరు పురుగులు మొదటి దశలో ఆకులను తిని తరువాత కాయల్లో చేరి లోపలి పదార్థాన్ని తినివేస్తాయి. ఉధృతి అధికమైనప్పుడు భారీ పంట నష్టం జరుగుతుంది

**నివారణ :**

❖ కాయ తొలిచే పురుగుల ఉనికిని గుర్తించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను పెట్టాలి

❖ గుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్ల పురుగులను నివారించడానికి నోవాల్యూరాన్ 0.75 మి.లీ. లేదా డైఫ్లూబెంజురాన్ 1 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ బాగా ఎదిగిన లద్దె పురుగులను నివారించడానికి విషపు ఎరలను వాడాలి.

❖ ఈ విషపు ఎరలను, 5 కిలోల తవుడు,500 గ్రా.బెల్లం, 500 మి.లీ. క్లోరోపైరిఫాస్, తగినంత నీటిని కలిపి తయారు చేయాలి.

❖ కాయ తొలిచే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోర్ ఫెనపైర్2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

# ధాన్యం కొనుగోలులో ఈ నియమాలు పాటిస్తే ధాన్యానికి మంచి ధర

బి.మధుకర్, పి.ఎచ్.డి. పి.జె.టి.ఎస్.ఎ.యు., శివకుమార్ చిన్నం, వ్యవసాయ విస్తరణ అధికారి, కొలనుపాల-1 క్లస్టర్,
ఆలేరు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. అనేక ప్రాంతాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేసింది. దీని కోసం తెలంగాణ వ్యాప్తంగా 7,139 కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ తరుణంలో కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకెళ్లేటప్పుడు రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అప్పుడే ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా సాగుతుంది. అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం.

**సూచనలు :** రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి.

❖ ప్రభుత్వం ఏ-రకం వరి ధాన్యానికి రూ.2320, బీ-రకం వరి ధాన్యానికి రూ.2300గా మద్దతు ధర నిర్ణయించింది. అందుకే సర్కారు ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మితే పైన సూచించిన ధర పొందే అవకాశం ఉంటుంది.

❖ ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ, తాలు, మట్టి పెళ్లలు లేకుండా ధాన్యాన్ని వ్యవసాయ క్షేత్రాల వద్దే శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలి.

కొనుగోలు కేంద్రాలు దసరా నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరి కోతలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున దసరా తర్వాత ధాన్యం కొనుగోళ్ళు జోరందుకోనున్నాయి. వరి పంట కోతల జరిగే తీరును బట్టి రాష్ట్రంలో జిల్లాల వారీగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. తొలుత నిజామాబాద్, నల్గొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలని ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ వర్గాలు నిర్ణయించాయి, తర్వాత వరి పంట కోతలను బట్టి జిల్లాలలో ప్రారంభించే అవకాశం ఉంది.

జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలను చూస్తే నిజామాబాదులో అత్యధికంగా 480, జగిత్యాలలో 421, సిద్దిపేటలో 417, మెదక్‌లో 387, నల్గొండలో 375, కామారెడ్డిలో 351, కరీంనగర్, మంచిర్యాలలో 326 ,యాదాద్రి భువనగిరిలో 323, పెద్దపల్లిలో 311, రాజన్న సిరిసిల్లలో 258 , నాగర్ కర్నూల్ 244, వనపర్తిలో 244, ఖమ్మంలో 236, మహబూబాబాద్ లో 234, నిర్మల్ లో 228,సూర్యాపేటలో 206, వరంగల్ లో 203, మహబూబ్ నగర్ లో 189, జయశంకర్ భూపాలపల్లిలో 189, సంగారెడ్డిలో 123, జనగామ లో 180,ములుగులో 173, భద్రాద్రి కొత్తగూడెంలో 160, హనుమకొండలో 149, నారాయణపేటలో 95 , వికారాబాద్ 92, జోగులాంబ గద్వాలలో 55 , రంగారెడ్డి జిల్లాలో 45, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 30, మేడ్చల్ మల్కాజిగిరిలో 12 అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 3 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

**ధాన్యం సేకరణ - ప్రభుత్వ సూచనలు :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటికే ధాన్యాన్ని కొంటున్నారు. రైతులెవరూ కనీస మద్దతు ధర (సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320) కంటే తక్కువకు ధాన్యం అమ్ముకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించింది. రైస్ మిల్లర్లు, వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

వానకాలం వరి పంట కొనుగోలుకు 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూత్రపాయంగా నిర్ణయించింది. ఇందులో 4496 పి.ఎ.సి.ఎస్. కేంద్రాలు, 2102 ఐ.కె.పి. సెంటర్లు, 541 కొనుగోలు కేంద్రాలు వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నాయి. అవసరం ఉన్నచోట కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచే

అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. ధాన్యంలో తేమ 17 శాతం ఉంటేనే ఎం.ఎస్.పి. (కనీస మద్దతు ధర) వస్తుందని పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. ధాన్యం సేకరించిన 48 గంటల్లో నగదు చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ధాన్యం విక్రయానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులు ఉన్నట్లైతే అన్నదాతలు టోల్ ఫ్రీ, హెల్ప్ లైన్ నంబర్లు 1967 లేదా 18004250033కు ఫోన్ చేయవచ్చని పౌరసరఫరాల శాఖ సూచించింది.



**సన్నధాన్యం సప "రేటు" :** సన్న ధాన్యం కొనుగోలుకి ప్రత్యేక కేంద్రాలు. సన్నధాన్యం క్వింటాలకి రూ.500 బోనస్.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కల్పి సన్నధాన్యం క్వింటాల్ ధర రూ, 2820/-.

సన్నధాన్యాలకి బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కొనుగోలు ప్రక్రియను చేపట్టనుంది. బియ్యపు గింజ పొడవు వెడల్పుల నిష్పత్తి నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే క్వింటా సన్నధాన్యానికి 500 రూపాయల బోనస్ వర్తిస్తుంది. ఈ మేరకు ఇప్పటికే పౌరసరఫరాల శాఖ వ్యవసాయ శాఖ అధికారులకు సన్నధాన్యం కొనుగోలు పైన ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసిన 33 సన్న ధాన్యం రకాలు :** సిద్ధి (డబ్ల్యూజె.జి.ఎల్.-44), కంపాసాగర్ వరి-1 (కేపీఎస్ 2874), సాంబ మసూరి (బి.పి.టి. 5204), జగిత్యాల వరి-3 (జె.జి.ఎల్. 27356), జగిత్యాల వరి-2 (జె.జి.ఎల్. 28545), వరంగల్ సాంబ (డబ్ల్యూజె.జి.ఎల్. 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూజె.జి.ఎల్. 32100), జగిత్యాల మసూరి (జె.జి.ఎల్. 11470), పొలాస ప్రభ (జె.జి.ఎల్. 384), క్రిష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోన (జె.జి.ఎల్. 3828), తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2 (కేఎన్ఎం 1638), వరంగల్ వరి-2 (డబ్ల్యూజె.జి.ఎల్. 962), రాజేంద్రనగర్ వరి- 4 (ఆర్ఎన్ఆర్ 21278), కూనారం వరి-1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జె.జి.ఎల్. 1798), జగిత్యాల సాంబ (జె.జి.ఎల్. 3844), కరీంనగర్ సాంబ (జె.జి.ఎల్. 3855), అంజన (జె.జి.ఎల్. 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449), ప్రద్యుమ్న (జె.జి.ఎల్. 17004), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని (ఆర్ఎన్ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యూజె.జి.ఎల్. 347), ఆర్ఎన్ఆర్ 31479 (పి.ఆర్.సి.), కేపీఎస్ 6251 (పి.ఆర్.సి.), జె.జి.ఎల్. 33124 (పి.ఆర్.సి.), హెచ్ఎంటీ సోన, మారుటేరు సాంబ (ఎంటీయూ 1224), మారుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ1271.

**సన్నధాన్యంగా పరిగణించబడాలంటే ఉండాల్సిన నిర్దేశిత ప్రమాణాలు :**

- ఒక బియ్యం గింజను 'గ్రెయిన్ కాలిపర్' అనే మిషన్ లో వేసి పొడవు వెడల్పు కొలుస్తారు నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే సన్నధాన్యంగా పరిగణిస్తారు.
- గింజ పొడవు 6 మి.మీ కంటే తక్కువ ఉండాలి.
- వెడల్పు 2 మి. మీ కంటే ఎక్కువ ఉండొద్దు
- పొడవు, వెడల్పుల నిష్పత్తి 2.5 మి.మీ కంటే ఎక్కువ ఉండాలి.

# నూతన వ్యవసాయ అధికారుల శిక్షణా కార్యక్రమం

– వ్యవసాయశాఖ

తెలంగాణ ప్రభుత్వం 144 నూతన వ్యవసాయ అధికారులను నియమించింది. అందులో143 వ్యవసాయ అధికారులు మన శాఖలో చేరారు. కొత్తగా చేరిన వ్యవసాయ అధికారులకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శిక్షణా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఇరవై ఒక్క రోజులపాటు (21-10-2024 నుండి 09-11-2024) శిక్షణ జరిగింది. కార్యక్రమంలో నూతన వ్యవసాయ అధికారులకు మన శాఖ అమలు చేసే పథకాల పైన, విత్తన, పురుగు మందుల, ఎరువుల చట్టాల పైన అధికారులు, అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పించారు.

ఇంకా తెలంగాణ వాతావరణ పరిస్థితులు, నేలలు, పంటల విస్తీర్ణం నమోదు చేసే పద్ధతి, పంటల సరళి, సమగ్ర పంటల యాజమాన్యం, వరి పండించే పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, పంటల మార్పిడి ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యత, పప్పు దినుసుల, నూనె గింజ పంటల ప్రాముఖ్యత, సేంద్రీయ వ్యవసాయం, సహజ పంటల వ్యవసాయ విధానాలపైన అవగాహన, శిక్షణ ఇచ్చారు. అంతే కాకుండా పాలనా పరంగా కావలసిన శిక్షణ జరిగింది. అందులో ముఖ్యంగా కండక్టర్ రూల్స్, లీవ్ రూల్స్, ఆర్టిఐ చట్టం, సబార్డినేట్ రూల్స్ విషయాలపైన శిక్షణ ఇచ్చారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా అధికారుల మానసిక అభివృద్ధి కోసం తరగతులు తీసుకున్నారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా వీరిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్ కాంప్లెక్స్, భారతీయ వరి పరిశోధనా సంస్థ, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, ఇక్రిశాట్, నోవా అగ్రిటెక్ కంపెనీ, నూజివీడు విత్తన కంపెనీ, కన్హా హార్ట్ ఫుల్ నెస్ పీస్ సంస్థలకు తీసుకువెళ్లి శిక్షణ కూడా ఇప్పించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్, వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్. పాల్గొన్నారు.

చివరి రోజున ముగింపు కార్యక్రమంలో తెలంగాణ ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డా.జి.చిన్నా రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి పాల్గొని వారికి వారి విధుల నిర్వహణ సక్రమంగా చేయడానికి మార్గదర్శకం చేశారు. అనంతరం వారికి శిక్షణా కార్యక్రమం పత్రాలను అందజేశారు. వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

(కార్యక్రమ దృశ్యాలు 2,3వ కవర్లపై చూడగలరు..)

## వ్యవసాయశాఖ తెలుగు వెబ్ సైట్ నుంచి వ్యవసాయ పాడిపంటలు సంచికను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..




వ్యవసాయశాఖ వెబ్‌సైట్ **http://vyavasayam.telangana.gov.in** ను చూడగలరు

# ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, మెళకువలు

బి.దీపక్ రెడ్డి, పి.శ్రీలత, టి.పావని, ఎన్.చరిత, ఏ.సాయి కిషోర్, ఎస్.మధుసూదన్ రెడ్డి, ఎం.రామ్ ప్రసాద్,
కె.గోపాల కృష్ణ మూర్తి, జె.హేమంత్ కుమార్, వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట

పల్లెలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే వ్యవసాయం కారణం. కొంతమంది రైతులు ప్రకృతి ఒడిలో ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం లేదా ప్రకృతి సేద్యం గత కొంత కాలంగా ప్రాచుర్యం పొందింది. రసాయన సేద్యంతో నష్టపోయిన రైతులు ఎక్కువ మంది సుభాష్ పాలేకర్ గారి పద్ధతులను పాటిస్తూ ప్రకృతి సేద్యంలోకి ప్రయాణం చేస్తున్నారు. ప్రధానంగా పద్మశ్రీ గ్రహీత సుభాష్ పాలేకర్ గారు ప్రకృతి వ్యవసాయంలో అనుసంధానకర్తగా వ్యవహరించి చాలా మంది రైతులకు ఆదర్శంగా నిలిచి తనదైన శైలిలో మన దేశంలో ప్రకృతి సేద్యానికి పితామహుడిగా నిలిచారు. అతి తక్కువ ఖర్చుతో గో- ఆధారిత సహజ ఎరువులు, వాటి మిశ్రమాలతో, ప్రకృతిలో సహజంగా దొరికే వనరులతో కషాయాలు, నూనెలు తయారు చేసుకుని, భూసారాన్ని పెంచుకుంటూ, చీడపీడల్ని నివారించుకుంటూ అధిక దిగుబడులతో పాటు పర్యావరణాన్ని కాపాడుకుంటూ అందరికీ నాణ్యమైన రసాయన రహిత ఆహారాన్ని అందించడానికి కొంతమంది ప్రకృతి నేస్తాలు పూనుకున్నారు. వీరికి సహాయంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి వివిధ పథకాలు ప్రకటించడమే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, సమగ్ర ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులందరికీ చేరువ చేయటానికి, "నేషనల్ మిషన్- ప్రకృతి వ్యవసాయం" పేరిట ఒక విభాగాన్ని స్థాపించింది. ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన ముఖ్య సూత్రాలు, రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆచరించాల్సిన ముఖ్య విధానాలను సమగ్రంగా తెలుసుకుందాం.

**ప్రకృతి వ్యవసాయం- ఆవశ్యకత :** హరిత విప్లవం మన దేశంలో ఆహారధాన్యాల వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు ఆహారధాన్యాల నిల్వలు పెరిగి సమృద్ధత చేకూర్చింది. దీనితో పాటు విచక్షణ రహితంగా రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇతర హానికారక రసాయనాల వాడకం పెరిగి ప్రకృతి వనరుల దుర్వినియోగమై భూసారం తగ్గటంతో పాటు భూమి నిర్వీర్యంగా తయారవుతోంది. ప్రకృతిలో వాతావరణం, నీరు, ఆహార కాలుష్యానికి కారణమవుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించడానికి, మన సహజ వనరులను కాపాడుకుంటూ, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకుంటూ, రైతులకు సుస్థిర వ్యవసాయ దిగుబడులను అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడానికి పూనుకుంటున్నాయి. ఇప్పటికే కొందరు ఆదర్శ రైతులు దేశంలో సుభాష్ పాలేకర్ గారి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సమర్థవంతంగా పాటిస్తున్నారు. కొన్ని రాష్ట్రాలు, ప్రముఖంగా ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, కేరళ, జార్ఖండ్, ఒరిస్సా, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఛత్తీస్ ఘడ్, తెలంగాణ, మేఘాలయ ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయంలో ముందంజలో ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, రెండు పద్దతులలో రసాయన రహిత సేద్యం గురించి చెబుతున్నప్పటికీ కొంతవరకు రెండింటి మధ్య వ్యత్యాసం ఉంది. సేంద్రీయ పద్దతులలో కొన్ని సేంద్రియ, జీవ ఉత్పత్తులను బయట నుంచి కొనుగోలు చేసి వాడతారు. అవసరాన్ని అనుసరించి కొన్ని ప్రకృతి ఖనిజాల నుంచి పోషకాలు వాడి భూసారాన్ని సరిచేస్తారు. ప్రకృతి వ్యవసాయంలో పూర్తిగా ప్రకృతి సహజ ఎరువులు (మల్చింగ్), సహజ కషాయాలు, గోఆధారిత సహజ తయారీలు (ఆవు పేడ, గోమూత్రం) మాత్రమే వాడి, బయట నుంచి జీవసంబంధమైన మందులు కానీ, సేంద్రీయ ఉత్పత్తులు కానీ కొనుగోలు చేయకుండా సేద్యం చేయాలి.

**ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన సూత్రాలు :** ప్రకృతిలో జీవుల మనుగడ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటుంది. రసాయన వ్యవసాయం జీవుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రకృతి వ్యవసాయంలో మాత్రమే జీవ వైవిధ్యం మనుగడ సాగించే అవకాశం ఉంది. మన భవిష్యత్ తరాలకు సారవంతమైన నేల, నాణ్యమైన ఆహారం, కాలుష్యం లేని వాతావరణం అందించాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు మన రైతులంతా మొగ్గు చూపాలి. సుభాష్ పాలేకర్ అనుసరించిన వ్యవసాయ విధానాలు మన రైతులకు ఆదర్శంగా నిలిచాయి. ప్రభుత్వాలు కూడా ఈ వ్యవసాయ విధానాలతో ఆమోదించబడిన ప్రకృతి లేదా సహజ వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేసే పథకాలను రూపొందించాయి. ప్రకృతికి మేలు చేసే జీవుల వినాశనం కలుగకుండా ఒక ఆవుతోనే వ్యవసాయం సాగించవచ్చు. రసాయన ఎరువులు కాని పురుగు మందులు కాని వాడకుండా మన ఇంట్లో, పరిసరాల్లో సహజ వనరుల రూపంలో దొరికే పదార్థాలను వాడి, సేద్య పద్ధతుల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేసి రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని నిరూపించబడినది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని నేషనల్ మిషన్- ప్రకృతి వ్యవసాయం నిర్దేశించిన ప్రధాన విషయాలు లేదా సూత్రాలు ఈ విధంగా ఉన్నాయి.

- ❖ ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా వైవిధ్యమైన వివిధ పంటల వ్యవస్థలను, పంటల సరళిని, అంతరపంటలని తీసుకోవలసిన అవసరం ఉంటుంది.
- ❖ దేశవాళి ఆవులనుంచి వచ్చే వివిధ వ్యవసాయ ఉత్పత్తులు లేదా ఉత్పాదకాలతో మొక్కలకు కావలసిన పోషకాలు అందచేయటం, భూసారాన్ని పెంచటం
- ❖ పంటల సస్యరక్షణకు వివిధ మొక్కలు, చెట్ల నుంచి తయారు చేసే కషాయాలు వాడటం
- ❖ వీటితో పాటు పచ్చిరొట్ట ఎరువులు వాడకం, వ్యవసాయ వ్యర్థాలు లేదా పచ్చని ఆకులతో మల్చింగ్(ఆచ్ఛాదన) విధానం వంటి పద్ధతులు జోడించడం, నేలలో తేమ, గాలి సమతుల్యం అనుసరించడం, నేలను వీలున్నంత వరకు దుక్కి చేయకపోవడం
- ❖ దేశవాళి ఆవులు, దేశీయ విత్తనాలు, దేశీయ వానపాములు, దేశీయ సూక్ష్మజీవులు, సంప్రదాయ పద్ధతులతో సుభాష్ పాలేకర్ గారు ప్రతిపాదించిన గోఆధారిత ప్రకృతి వ్యవసాయం లేదా సహజ/ సంప్రదాయ వ్యవసాయాన్ని మన దేశంలోని రైతులు ఆదర్శంగా పాటించవలసిన తరుణం ఆసన్నమైంది. దీనికి మద్దతుగా తోటి రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలలో 'రైతునేస్తం ఫౌండేషన్' సేంద్రీయ, ప్రకృతి ఆధారిత ఉత్పత్తులలో ముందంజలో ఉంది. ఒక దేశీయ ఆవుతో ముప్పై ఏకరాల వ్యవసాయం చేయవచ్చని ప్రకృతి వ్యవసాయంలో నిర్దేశించారు. సహజవనరులతో లబ్ధి చేకూర్చే వివిధ ప్రకృతి వ్యవసాయ పదార్థాల తయారీ గురించి తెలుసుకుందాం.

**గో - ఆధారిత కషాయాలు :** గో- ఆధారిత కషాయాల తయారీ విధానం రైతునేస్తం వారి 'ప్రకృతి నేస్తాలు' ప్రచురణ నుంచి, రైతుల అనుభవాల నుంచి సేకరించారు.

**బీజామృతం:** 20 లీటర్ల నీటిని ఐదు లీటర్ల గోమూత్రం,5కిలోల పశువుల పేడ, 50గ్రాముల సున్నం, 50 గ్రాముల పుట్టమట్టి కలిపిన మిశ్రమంతో విత్తనశుద్ధి చేయటం వలన మొలక శాతం పెరిగి విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నియంత్రించవచ్చు. బీజామృతంను తయారు చేసిన వెంటనే వాడుకోవాలి. నిల్వ ఉంచరాదు.

**జీవామృతం:** దీనిని రెండు విధాలుగా వాడుకోవచ్చు.

**ఘన జీవామృతం:** వంద కిలోల తాజా పశువుల ఎరువుకు 5 లీటర్ల గోమూత్రం, 2 కిలోల నల్ల బెల్లం, 2 కిలోల పప్పులపొడి (పెసర, మినుము, శనగ, ఉలవ పిండి), 50 గ్రాముల పుట్టమట్టి కలిపి తయారు

చేస్తారు. ఈ విధంగా తయారు చేసిన 50 కిలోల జీవామృతం ఎకరానికి 400 కిలోల చొప్పున రెండు దఫాలుగా దుక్కిలో ఒకసారి, తరువాత 30-45 రోజులకు ఒకసారి పొలానికి అందించాలి. ఈ జీవామృతం రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా వాడి భూసారం, భూమిలో సూక్ష్మజీవులు, వానపాముల సంఖ్య అపారంగా పెంచుకోవచ్చు.



పంచగవ్య తయారీ లో ఉపయోగించే పదార్థములు

**ద్రవ జీవామృతం:** డ్రమ్ములో 200లీటర్ల నీటికి 10 లీటర్ల గోమూత్రం, 10 కిలోల తాజా ఆవు పేడ,2 కిలోల నల్ల బెల్లం, 2కిలోల పప్పుల పొడి, 50 గ్రాముల పుట్టమట్టి కలిపి కర్రతో కుడివైపుగా (సవ్య దిశలో) బాగా కలియబెట్టి, గోనె సంచి కప్పి 48 గంటలు నానబెట్టాలి. మధ్యలో అప్పుడప్పుడూ కలియబెడుతూ ఉండాలి. ఈ ద్రవజీవామృతంను సాగునీటి కాలువల ద్వారా కానీ, నేరుగా భూమికి గానీ, పిచికారీ ద్వారా కానీ ఎకరానికి 200 లీటర్ల మోతాదులో అందజేయాలి. ద్రవజీవామృతంను


ద్రవ జీవామృతం

తయారు చేసిన 9 రోజుల లోపుగా వాడుకుంటే మంచిది. ఎప్పటికప్పుడు తాజాగా జీవామృతం తయారు చేసుకుని వాడాలి.

**పంచగవ్య:** 5కిలోల తాజా ఆవుపేడలో 1/2 కిలో ఆవునెయ్యి కలిపి వెడల్పు మూతి గల ప్లాస్టిక్ డ్రమ్ము లేదా మట్టి కుండలో వేసి, మధ్యమధ్యలో కలుపుతూ నాలుగు రోజులు ఉంచాలి. 5వ రోజు ఈ మిశ్రమానికి 3 లీటర్ల ఆవు మూత్రం, 2 లీటర్ల ఆవు పాలు, 3 లీటర్ల కల్లు, 2 లీటర్ల ఆవు పెరుగు, 3 లీటర్ల లేత కొబ్బరి నీరు, ఒక కిలో నల్ల బెల్లం, 12 మగ్గిన అరటిపండ్లు మెత్తగా చేసి బాగా కలియతిప్పాలి. ఈ పాత్రకు గుడ్డతో మూతి బిగించి మధ్యలో కలియబెడుతూ 15 రోజులు ఉంచాలి. తరువాత ఈ మిశ్రమాన్ని పలుచటి గుడ్డలో వడబోసి ఎకరానికి మూడు లీటర్ల పంచగవ్యను 100 లీటర్ల నీటికి కలిపి పంటల వివిధ దశలలో పిచికారీ చేయవచ్చు. పంచగవ్యని మొక్కల ఎదుగుదలకు, చీడపీడల నివారణకు, విత్తనశుద్ధికి, నారుమళ్ళలో వాడవచ్చు. పంచగవ్య పంటలకు వ్యాధినిరోధక శక్తిని అందిస్తుంది. పంట ఉత్పత్తుల నాణ్యతను, నిల్వను,రుచిని పెంచుతుంది. సాగునీటి ద్వారా, బిందు సేద్యంద్వారా కూడా పంచగవ్యను వాడవచ్చు. పంచగవ్యను ఆరునెలల వరకు వాడుకోవచ్చు.

**నీమాస్త్రం:** 5 కిలోల వేప ఆకు బాగా దంచి 200 లీటర్ల నీటిని కలపాలి. ఈ మిశ్రమంలో 5 లీటర్ల తాజా గోమూత్రం, 1 కిలో తాజా ఆవుపేడ వేసి కర్రతో బాగా కలియబెట్టాలి. దీనిని 24-48 గంటలు మూతతో కప్పి నానబెట్టాలి. ఈ మిశ్రమాన్ని వడగట్టి పంటలపై ఎకరానికి పిచికారీ చేయవచ్చు. పంటలను ఆశించే పురుగుల నివారణకు నీమాస్త్రం ఉపయోగపడుతుంది.

**బ్రహ్మాస్త్రం:** 2-3 కిలోల వేప ఆకు, రెండు కిలోల పల్లేరాకు,రెండు కిలోల ఉమ్మెత్త ఆకు, 2 కిలోల సీతాఫలం ఆకు, విడివిడిగా, బాగా మెత్తగా నూరి ఒక పాత్రలోకి తీసుకుని 10 లీటర్ల తాజా గోమూత్రం కలిపి బాగా కలియబెట్టిన తరువాత మూతపెట్టి అరగంట పాటు మరగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని 48 గంటల పాటు

చల్లారనిచ్చి గుడ్డలో వడపోయాలి.ఎకరానికి మూడు లీటర్ల బ్రహ్మాస్త్రాన్ని 100 లీటర్ల నీటికి కలిపి పంటలపై పురుగులు, తెగుళ్ల నియంత్రణకై పిచకారీ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఆరునెలల వరకు నిల్వ ఉంచుకోవచ్చు. పైన చెప్పిన ఆకుల లభ్యత లేనపుడు పొంగామియా ఆకు, మామిడి ఆకు, మారేడు ఆకు లేదా జామ ఆకులతో కూడా ఈ మిశ్రమాన్ని తయారు చేసుకోవచ్చు.

**అగ్ని అస్త్రం:** 1 కిలో పొగాకు, 1/2 కిలో వెల్లుల్లి, 1 కిలో పచ్చిమిర్చి 5 కిలోల వేపాకులను విడివిడిగా దంచుకుని ఒక పాత్రలోకి తీసుకుని 10 లీటర్ల గోమూత్రాన్ని కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలియబెట్టి నాలుగు సార్లు పొంగు వచ్చేటట్లు మరిగించాలి. 48 గంటల పాటు చల్లారనిచ్చిన తరవాత మూడు లీటర్ల అగ్ని అస్త్రంను 100 లీటర్ల నీటికి కలిపి పంటలపై పిచికారీ చేయాలి.పంటలపై ఆశించే లద్దెపురుగులు, పచ్చ పురుగులు, కాండం, కాయ తొలిచే పురుగుల నివారణకు అగ్ని అస్త్రం వాడవచ్చు.

పైన వివరించిన గోఆధారిత కషాయాలతో పాటు ప్రకృతి వ్యవసాయంలో వివిధ మొక్కలు, చెట్లు, గింజల నుండి తయారు చేసిన కషాయాలు పురుగులు, తెగుళ్ల నివారణకు వాడతారు. వీటిలో ముఖ్యంగా వేపగింజల కషాయం, వావిలాకు కషాయం, లొట్ట పీసు (తూటాకు) కషాయం, పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం, ధపత్ర కషాయం, మారేడు పత్ర కషాయం, పిచ్చి తులసి కషాయం, కానుగ పప్పు కషాయం, నిమ్మగడ్డి కషాయం వంటివి వాడుకలో ఉన్నాయి. రైతులు మరెన్నో కషాయాలను వివిధ పంట ఉత్పత్తుల కలయికతో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వాడుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో చేప కషాయం (మీనామృతం) వంటి ఔషధ శక్తి కలిగిన ద్రావణాన్ని ఉద్యాన పంటలలో చీడపీడల నివారణకు వాడుతున్నారు. ఇవి కాకుండా రైతులు గానుగ చేత తీసిన ఆముదం, నువ్వులు, కానుగ, వేప, కొబ్బరి నూనెలు కూడా ప్రకృతి వ్యవసాయంలో వాడి పోషకాలు అందచేసి, చీడపీడలను నివారిస్తున్నారు.




ప్రకృతి వ్యవసాయంలో ప్రధాన సమస్యగా ఉండే గో- ఆధారిత ఉత్పత్తులు, వాటి లభ్యత, వాటి తయారీ, పాడి కొరత రైతులకు కొంత అవరోధం కలుగజేసే అవకాశం ఉంది. దీనిని అధిగమించడానికి ప్రభుత్వం రైతులకు పాడి చేకూర్చే ప్రయత్నాలు చేపట్టాలి. నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ మన దేశంలో గోశాలలను ఆర్థిక సహాయంతో వృద్ధి చేసి గోఆధారిత ఉత్పత్తులను రైతులకు అందించడానికి కృషి చేయాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ పద్ధతులను వ్యవసాయ పరిశోధనా సంస్థలలో కూడా పరిశీలించే నిమిత్తం, రైతులకు అవగాహన కల్పించటం కొరకు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. మన తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థ ఏ.పి. రైతు సాధికార సంస్థ 2021లో అన్ని పంటలకు ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన సాగు పద్ధతుల ప్యాకేజీ మరిన్ని వివరాలతో రూపొందించి రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ఈ నివేదిక ప్రకృతి వ్యవసాయానికి ఒక నిఘంటువు లాగా ఉపయోగ పడుతోంది.

అధిక ఖర్చులు, పెట్టుబడులతో చేసే రసాయన వ్యవసాయం కన్నా అతి తక్కువ ఖర్చు, తక్కువ పెట్టుబడితో చేసే ప్రకృతి వ్యవసాయం సుస్థిర పంట దిగుబడులతో ఒక ప్రజా ఉద్యమంగా ముందుకు సాగాలని మన ప్రధాన మంత్రి మన దేశ నలుమూలల రైతులను చైతన్య పరచడానికి సమగ్ర ప్రణాళికతో కార్యాచరణ మిషన్‌ను ప్రతిపాదించారు. ఈ మిషన్‌ను సమిష్టి బాధ్యతగా అందరం ముందుకు తీసుకువెళ్లాలి.

# నాణ్యమైన విత్తనం- ప్రాముఖ్యత

డా.వి.స్వర్ణలత, డా.కె.ప్రభావతి, స్నిగ్ధ శ్రీ లాస్య, డా.ఎం.మాధవి, డా.పి.జగన్మోహన్ రావు,
విత్తన పరిశోధన, సాంకేతిక విభాగం, రాజేంద్రనగర్ -34, హైదరాబాద్.

అధిక దిగుబడిని సాధించడానికి నాణ్యమైన విత్తనాన్ని వాడడం చాలా అవసరం. అధిక దిగుబడికి మంచి రకం తో పాటు నాణ్యమైన విత్తనం వాడటం కూడా ముఖ్యమైనది కల్తీ విత్తనాలు వాడటం వలన పంట దిగుబడి, గింజ నాణ్యత తగ్గడమే కాకుండా పంటపై చీడపీడల సమస్యలు ఎక్కువ, అన్ని విధాల నష్టం జరుగుతుంది. విత్తనం నాణ్యమైనది కానట్లయితే ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించినా అధిక దిగుబడిన సాధించలేం. విత్తన రకాలు గురించి సమగ్ర అవగాహన ఉన్నప్పుడే మంచి నాణ్యమైన విత్తనాలు ఎంపిక సాధ్యమవుతుంది

**విత్తనోత్తపత్తికి ఉపయోగించే విత్తనాల లక్షణాలు :** ఒక్కోరకం విత్తనాలకు, విత్తనాల నుంచి వచ్చిన మొక్కలకు ప్రత్యేకమైన లక్షణాలు ఉంటాయి. ప్రతి రకపు విత్తనం ఆ రకపు స్వాభావిక లక్షణాలను తప్పనిసరిగా కలిగి ఉండాలి, దీనినే జన్యు స్వచ్ఛత అంటారు.

- ❖ విత్తనంలో చెత్తాచెదారం, రాళ్ళు, చెడిపోయిన విరిగిపోయిన తాలు గింజలు భౌతికమైన మలిన పదార్థాలు లేకుండా చూడాలి.
- ❖ విత్తనం అత్యధిక మొలకశాతాన్ని ఇచ్చేదిగా ఉండాలి.
- ❖ విత్తనానికి తెగుళ్ల లేకుండా కలుపు మొక్కలకు సంబంధించిన విత్తనాలు లేకుండా చూడాలి.
- ❖ విత్తనం తేమశాతం 11 నుంచి 13 కలిగి ఉండాలి.
- ❖ ధ్రువీకరించిన విత్తనాన్ని అధికృత డీలర్ వద్ద గాని గుర్తింపు పొందిన విత్తన ఉత్పత్తి సంస్థ నుంచి గాని వ్యవసాయ పరిశోధనా స్థానాల నుంచి గాని సేకరించాలి. విత్తన శుద్ధి తప్పక చేయాలి.

**విత్తనోత్పత్తి దశలు :** విత్తనం జన్యు నాణ్యత కాపాడుతూ మేలైన విత్తనాన్ని సాధించడానికి నాలుగు దశల్లో ఉత్పత్తి చేస్తారు

**బ్రీడర్ విత్తనం (మూల విత్తనం) :** బ్రీడర్ విత్తనాన్ని న్యూక్లియస్ విత్తనం ద్వారా ఉత్పత్తి చేస్తారు. ఈ విత్తనాన్ని విత్తనం కనిపెట్టిన శాస్త్రవేత్త గాని లేదా, అ విత్తనానికి కనుగొన్న సంస్థ నుంచి గాని స్వీయ పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. ఇది నూటికి నూరుశాతం జన్యు స్వచ్ఛత కలిగి ఉంటుంది

**పునాది విత్తనం (ఫౌండేషన్ విత్తనం):** దీనిని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. ఇది సర్టిఫైడ్ విత్తనాలకు ఆధారం. ఇది కూడా ఉత్తమ ప్రమాణాలు అనగా దాదాపు 98% జన్యు స్వచ్ఛత కలిగి ఉండాలి. కేవలం ఒకటి లేదా రెండు శాతానికి మించి కేళీలు ఉండరాదు. దీనిని ప్రభుత్వ సహకార విత్తనాభివృద్ధి సంస్థల్లో గాని, వ్యవసాయ పరిశోధన స్థానాల్లో గాని, అభ్యుదయ రైతుల క్షేత్రాల్లో గాని శాస్త్రవేత్తలు సంబంధిత విత్తనాభివృద్ధి, విత్తన ధ్రువీకరణ నిపుణుల పర్యవేక్షణలో పండిస్తారు.

**ధ్రువీకరించిన (సర్టిఫైడ్) విత్తనం:** దీనిని ఫౌండేషన్ విత్తనం నుంచి అభ్యుదయ రైతుల పొలాల్లో విత్తనోత్పత్తి నిబంధనలకు అనుగుణంగా పండిస్తారు. దీనిలో జన్యు నాణ్యత 90-98% ఉండాలి. ఈ విత్తనాన్ని తప్పకుండా ధ్రువీకరిస్తారు.

**లేబుల్ విత్తనం:** ఈ విత్తనం ధ్రువీకరించనిది. దీనిని సరాసరి విత్తనోత్పత్తిదారులు ఆకుపచ్చ రంగు లేబుల్ దాని పైన విత్తన ప్రమాణాలను ముద్రించి అమ్ముతారు దీనిని విత్తనోత్పత్తి దారుల నమ్మకం పైనే కొనాల్సి ఉంటుంది.

విత్తనాన్ని ఎండబెట్టేటప్పుడు తేమశాతం 11 శాతానికి చేరుకోనే వరకు బాగా ఎండబెట్టాలి. విత్తన నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలి. జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత 98% జడ పదార్థం 2% మించకుండా కనీస మొలక శాతం 80% తేమ 12% మించకుండా ఇతర పంటలు లేదా రకాల విత్తనాలు కిలో గింజల్లో 20 గింజలు మించకుండా విత్తనాన్ని తయారు చేయాలి.

# వరిలో ఎలుకల సమస్య - యాజమాన్య పద్ధతులు

డా.ఆర్.శ్రవణ్ కుమార్, డా.వి.వెంకన్న, డి.అశ్విని, బి.మాధవి, జి.నీలిమ, డా.వై.హరి, యు.నాగభూషణం, డా.సి.ఎచ్.రాములు, డా.బి.సతీష్‌చంద్ర, డా.కె.రాజేంద్ర ప్రసాద్, డా.సి.ఎచ్.అనూష, ఆర్.ఉమారెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ కళాశాల, వరంగల్

తెలంగాణలో వరి చాలా ప్రధానమైన ఆహార పంట. ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసే దశ నుండి గింజ పాలుపోసుకునే దశలో ఉంది. వరి పంట దిగుబడిని వివిధ పురుగులు, తెగుళ్ళు, పోషకలోప సమస్యలు, కలుపు మొక్కలు మొదలగు వాటితో పాటు ఎలుకలు కూడా ప్రభావితం చేస్తాయి. భారతదేశంలోనే కాక ఇండోనేషియా, వియత్నాం మొదలగు దేశాలలో కూడా ఎలుకలు వరి పంటకు నష్టం చేస్తున్నాయి. కొన్ని సార్లు సరైన సమయంలో యాజమాన్యం చేపట్టినట్లయితే 50-100 శాతం పంట నష్టం జరిగే అవకాశం ఉంది. నారు దశ నుండి పంటను అమ్మే వరకు ఎలుకలు నష్టం చేస్తాయి. ముఖ్యంగా చిరుపొట్ట దశలో వీటి వలన ఎక్కువ నష్టం జరుగుతుంది.

### నష్టం :

- ❖ ఎలుకలు వరి నారును ఆశించి ముక్కలుగా చేయడం వలన నారు చనిపోతుంది.
- ❖ పంట పిలక దశలో ఉన్నప్పుడు 45 డిగ్రీల కోణంలో కాండాన్ని ఏటవాలుగా కత్తిరిస్తాయి. పొలంలో ఖాళీలు ఏర్పడతాయి. కత్తిరించిన పిలకలను నీటిలో గమనించవచ్చు.
- ❖ గింజలు ఏర్పడే దశలో ఎలుకలు కంకులను కత్తిరించి, ఈ కంకులను, గింజలను ఎలుకలు వాటి కన్నాలలో నిల్వ చేసుకుంటాయి.

### అనుకూల పరిస్థితులు :

- ❖ వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత ఎలుకల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.
- ❖ నీటి పారుదల సౌకర్యం ఉండి, వరిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినప్పుడు, పంటను ఒకేసారి కాకుండా వివిధ రోజులలో విత్తి, పంట వివిధ దశలలో ఉన్నప్పుడు ఎలుకల సమస్య ఎక్కువగా ఉంటుంది.
- ❖ గట్లు పెద్దవిగా ఉన్నప్పుడు, పొలంలో, గట్ల మీద కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఎలుకల సమస్య ఎక్కువగా ఉంటుంది.

### యాజమాన్య పద్ధతులు :

- ❖ ఎలుకల ఉనికిపై నిఘా ఉంచి సరైన సమయంలో సస్యరక్షణ చేపట్టాలి.

➡

---

➡ ఉత్పత్తి చేపట్టేవారు విత్తనోత్పత్తి మెళకువలు అన్ని ఎప్పటికప్పుడు పాటిస్తూ పంటలలో కేళీలను గుర్తించి ఏరివేయాలి. పరిజ్ఞానం కలిగి ఉండి, శాస్త్రవేత్తలు లేదా నిపుణులు సూచించిన సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే మేలైన నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయవచ్చు.

రైతులు తమ పొలంలో విత్తనోత్పత్తి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వపరాగా పంటలైనటువంటి వరి, పెసర్లు, మినుములు మొదలగు పంటల్లో రైతులు ఒకసారి ధృవీకరింపబడిన విత్తనం కొనుగోలు చేసి రైతు స్థాయిలోనే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకొని తమ అవసరాలకే కాకుండా ఇతర రైతులకు కూడా విత్తనాన్ని సకాలంలో అందించడానికి తోడ్పడుతుంది. సాధారణంగా ఒకే విత్తనాన్ని కొంతకాలం సాగు చేసిన తర్వాత దిగిబడి తగ్గుతుందని ఆపోహతో రైతులు ఉన్నారు, కానీ దానికి ముఖ్య కారణం విత్తనంలో కల్తీ జరిగి స్వచ్ఛత తగ్గడం. స్వచ్ఛత అనేది ఇతర రకాలతో కల్తీ జరగడం వల్ల, పరపరాగ సంపర్కం వల్ల, స్వల్ప జన్యుపరమైన మార్పులు, యాంత్రిక కల్తీలు, ఆశించే తెగుళ్ల ప్రభావం వల్ల జరుగుతుంది. కాబట్టి విత్తన కల్తీలను నివారించి జన్యు స్వచ్ఛత కాపాడడం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని పొందడానికి రైతులు పైన సూచించడం మెళకువలు పాటించిడం శ్రేయస్కరం.

- పొలంలో గట్ల సంఖ్యను, గట్ల పరిమాణాన్ని తగ్గించాలి.
- పొలం గట్లపైన, పొలంలోపల కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
- సాధ్యమైనంత వరకు ఒక ప్రాంతంలో ఒకేసారి నాట్లు పడేటట్లు చూడాలి.

**ఎర బుట్టలు :** రైతులు సామూహికంగా నారుమడిలో నారు పోసిన దగ్గర నుంచి దమ్ములు పూర్తి అయిన తర్వాత ఒక నెల వరకు, కోతల తర్వాత ఎకరానికి 20 చొప్పున ఎలుక బుట్టలను పెట్టి వలస వచ్చే, పోయే ఎలుకలను నివారించవచ్చు.

**పొగబారించడం :** ఎలుకల కన్నాలలోకి పొగబారించినట్లయితే లోపల ఉన్న ఎలుకలు ఊపిరాడక చనిపోతాయి. దీనికి పొగబారించే యంత్రాలను (బర్రోఫ్యూమిగేటర్) ఉపయోగించవచ్చు.

**రసాయనిక పద్ధతులు :** బ్రోమోడయోలిన్, జింక్ ఫాస్ఫైడ్ ఎరల ద్వారా ఎలుకలను అరికట్టవచ్చు.

**బ్రోమోడయోలిన్ :** ఈ మందును వాడినప్పుడు ఎలుకలను మచ్చిక చేసుకోవాల్సిన అవసరం ఉండదు. మొదటి రోజు ఎలుకలు నివసించే రంధ్రాలను గుర్తించి ప్రతీ రంధ్రంలో 15 గ్రాముల బ్రోమోడయోలిన్ కలిపిన విషపు ఎరలు పెట్టాలి (96 పాళ్ళు నూకలు + 2 పాళ్ళు వంట నూనె + 2 పాళ్ళు బ్రోమోడయోలిన్). ఈ విషాన్ని తిన్న తర్వాత 4-5 రోజులలో ఎలుకలు రక్తహీనతతో చనిపోతాయి. 11వ రోజు సజీవ ఎలుక కన్నాలను గుర్తించినట్లయితే మరలా విషపు ఎరను కన్నాలలో పెట్టాలి.

**జింక్ ఫాస్ఫైడ్ ఎర : ఇది అత్యంత విషపూరితమైనది. దీనిని పంట కాలంలో ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.** ఈ మందును వాడే ముందు 2 రోజులు, విషం కలపని ఎరతో మచ్చిక చేసుకోవాలి.

1వ, 3వ రోజు - ఎలుకలు ఉన్న కన్నాలను గుర్తించి ప్రతి కన్నంలో 20 గ్రా. విషం కలపని ఎరని (బియ్యం / నూకలు 98 పాళ్ళు + వంటనూనె 2 పాళ్ళు) పెట్టాలి.

5వ రోజు - ప్రతీ ఎలుక కన్నంలో 10 గ్రా. జింక్ ఫాస్ఫైడ్ కలిపిన విషపు ఎరను (96 పాళ్ళ నూకలు + 2 పాళ్ళు వంట నూనె + 2 పాళ్ళు జింక్ ఫాస్ఫైడ్) ఉంచాలి. దీని ద్వారా 70-80 శాతం వరకు ఎలుకలను నివారించవచ్చు. చనిపోయిన ఎలుకలను ఏరి, పూడ్చివేయాలి.







# పత్తి పంట వ్యర్థాలను కాల్చవద్దు

డా.టి.ప్రభాకర్ రెడ్డి, డా.బి.రాజశేఖర్, డా.కె.రామకృష్ణ, డా.ఒ.శైల, డా.ఆదిశంకర్, డా.ఇ.జ్యోత్స్న,
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్ కర్నూలు జిల్లా

రైతులు పత్తి ఏరిన తర్వాత మిగిలిపోయిన పత్తి కట్టెను కాల్చడం అలవాటుగా మారిపోయింది. పత్తి కట్టెను తగులబెట్టడం వలన పొలంలో చేరిన కీటకాలను, వ్యాధికారక జీవులను నశింపచేయవచ్చని రైతులు అనుకుంటారు. కానీ పంట వ్యర్థాలను తగుల బెట్టడం వలన పర్యావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సాధారణంగా టన్ను పంట వ్యర్థాలను మండిస్తే 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు దాదాపు 1400 కిలోల కార్బన్ డయాక్సైడ్ గాలిలోకి విడుదల అవుతుంది. వీటితో పాటు మూడు కిలోల సూక్ష్మ ధూళి కణాలు, బూడిద, సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలుస్తున్నాయి. పత్తి కట్టెను కాల్చడం వలన కాలుష్యం పెరగడంతో పాటు భూసారం క్షీణిస్తుంది. సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుంది. వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడానికి కారణమవుతున్న పంట వ్యర్థాలను కాల్చడానికి బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించాలి.

పత్తి ఏరడం పూర్తయిన తర్వాత ఎకరంలో దాదాపు 20-30 క్వింటాళ్ళ పత్తి కట్టె మిగులుతుంది. ఈ పత్తి కట్టె తీసివేసే సమయంలో ట్రాక్టర్‌తో నడిచే ష్రెడ్డర్ యంత్రం ద్వారా ఒక ఎకరంలోని పత్తి కట్టెలను ఒక గంటలో నుజ్జు నుజ్జు చేయవచ్చు. తర్వాత రెక్క నాగలి లేదా దంతి నాగలితో లోతు దుక్కి చేయడం వలన ముక్కలైన పత్తి కట్టెతో పాటు మిగిలిన మొదళ్ళు కూడా భూమిలో కలిసిపోతాయి. ఏప్రిల్ లేదా మే నెలలో రోటవేటర్ సహాయంతో చదును చేసుకోవాలి. దీంతో పాటు వ్యర్థాలను తొందరగా కుళ్ళించే సూక్ష్మజీవుల కల్చర్‌ను, ట్రైకోడెర్మా జీవ శిలీంధ్ర నాశినిని పశువుల ఎరువుతో కలిపి నేలపై చల్లి రోటవేటర్‌తో భూమిని చదును చేసుకోవాలి. వేసవిలో అప్పుడప్పుడు కురిసే వర్షాల వలన భూమిలో కలిసిపోయిన పత్తి కట్టె కుళ్ళిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

పత్తి కట్టెను భూమిలో కలియదున్నడం వలన నేలలో సేంద్రియ కర్బనం పెరగడం వలన రసాయనిక ఎరువుల సామర్థ్యం పెరుగుతుంది. నేల భౌతిక స్వభావం మెరుగుపడి తేమను పట్టి ఉంచే శక్తి పెరుగుతుంది. నేలలో జీవ సంబంధ చర్యలు మెరుగుపడి పంట దిగుబడులు పెరుగుతాయి. ఒక టన్ను పత్తి కట్టె, మొదళ్ళు పెరగడానికి అది భూమి నుండి 4 కిలోల నత్రజని, 2 కిలోల భాస్వరం, 2.5





# వరి గడ్డిని కాల్చకుండా కుళ్ళడానికి మార్గాలు

డా.రమ్య రాథోడ్, ఎ.దినేష్, డా.ఎ. కృష్ణ చైతన్య, జి.నరేందర్, డా.బి.బాలాజీ నాయక్
ప్రాంతీయ చెరకు, వరి పరిశోధనా స్థానం, రుద్రూరు, నిజామాబాదు

మన దేశంలో వరిని 44 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నాం. దక్షిణ భారత ధాన్యగారాలుగా పేరు ఉన్న తెలుగు రాష్ట్రాల్లోనూ వరి సాగు విస్తీర్ణం కోటిన్నర ఎకరాలకు పైనే. పెద్ద ఎత్తున సాగు చేసే వరి పంట విషయంలో కోతలు పూర్తయ్యాక అధిక శాతం రైతులు చేసే పొరపాటు పంట అవశేషాలు తగలపెట్టడం. వరి గడ్డిని కాల్చుడం వల్ల భూమిలో ఉండే విలువైన సూక్ష్మ రాశి నశించిపోతుంది. అంతేకాకుండా కార్బన్ మోనాక్సైడ్ మిథేన్ వంటి హానికర వాయువులు కొన్ని మిలియన్ టన్నులు గాలిలోకి చేరి కాలుష్యం పెరిగిపోతుంది. కాబట్టి కోతల అనంతరం వరిగడ్డిని పశువులకు మేతగా వాడుకోవటం లేదా సేంద్రీయ పదార్థంగా తిరిగి భూమికి అందించడం చేయాలి.

మిషిన్‌తో కోతలు కోయడం వలన ఎకరానికి సుమారుగా ఒకటిన్నర నుండి రెండు టన్నుల గడ్డి పొలంలో ఉండిపోతుంది. దాన్ని త్వరగా కుళ్ళ పెట్టే విధానాన్ని అవలంబించినట్లయితే అది బాగా కుళ్ళుతుంది కానీ రైతులు దాన్ని తగలపెట్టేసి తర్వాత దాన్ని దమ్ము చేస్తున్నారు. సుమారుగా ఒక ఎకరానికి ఒకటిన్నర నుండి రెండు టన్నుల గడ్డిని తగల పెట్టడం వలన పంటకి అనేక పోషకాలు అందకుండా పోవటంతో పాటు పర్యావరణానికి కూడా మనం తీవ్రమైన నష్టాన్ని చేస్తున్నాం. దీన్ని అరికట్టి ఆ గడ్డిని కలియ దున్నడం వలన రైతులకు చాలా ఉపయోగాలు ఉన్నాయి.

గడ్డిని బాగా కలియ దున్నడం వలన ఆ పొలంలో కొద్ది మేరకు ఉన్న ఎరువులు (నత్రజని, భాస్వరం , పొటాష్) అలాగే సూక్ష్మ పోషకాలు కూడా భూమిలో కలియ దున్నిన తర్వాత దాదాపు 30 నుండి 90 రోజుల మధ్య దాంట్లో ఉన్నట్టి పోషకాలు అన్నీ కూడా తదుపరి పంటకి అందించగలుగుతాం. దీనివలన తదుపరి పంటలకు వేయవలసిన పోషకాలను 25 నుండి 30 శాతం వరకు తగ్గించుకోవడానికి ఆస్కారం ఉంటుంది, ఎరువుల మీద సాగు ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది. పొలంలో తగలపెట్టకుండా ఇలా మూడు కిలోల పొటాష్, కొంత మోతాదులో సూక్ష్మపోషకాలను కూడా తీసుకుంటుంది. అందువలన ఈ వ్యర్థాలను భూమిలో కలియదున్నితే ఈ పోషకాలన్ని తిరిగి నేలకు చేరతాయి. పత్తి కట్టెను సేంద్రియ ఎరువుగా మార్చడం వలన సిఫారుసు చేయబడిన రసాయన ఎరువులను 25 శాతం వరకు తగ్గించవచ్చు.

పత్తి కట్టె వ్యర్థాలను ముడి పదార్థాలుగా వాడుకొని కంపోస్టు పద్ధతిలో సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. వర్మీ కంపోస్టు విధానం ద్వారా కూడా పంట వ్యర్థాలపై వాన పాములను వదిలి 60 రోజులలో విలువైన కంపోస్టు తయారు చేసుకోవచ్చు. వాతావరణ కాలుష్యం తగ్గించుకోవాలన్న, నేలలో సేంద్రియ కర్బన శాతం పెరగాలన్నా పంట వ్యర్థాలను తిరిగి నేలకే చేర్చడం ఉత్తమమైన పద్ధతి.



నుండి ఐదు సంవత్సరాలు ఏకబాటుగా దమ్ము చేయటం వలన సేంద్రీయ కార్బన్ శాతం కూడా గణనీయంగా పెరగటానికి ఆస్కారం ఉంది. ఈ విధంగా చేసినట్లయితే రైతులు సాగు ఖర్చు తగ్గి, భూసార పరిరక్షణ కూడా జరుగుతుంది.

వరి గడ్డిని దమ్ము చేసే విధానం: పొలంలో నీళ్లు పెట్టి దాన్ని కేజ్ వీల్స్ లేదా రోటవేటర్‌తో ఒకసారి దమ్ము తరువాత ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ తోపాటు 10 నుండి 15 కిలోల యూరియా కలిపి వేసుకొని మళ్లీ మూడు నాలుగు రోజుల తర్వాత దమ్ము చేసుకుని మళ్లీ వారానికి ఆఖరి దమ్ము చేసుకున్నట్లయితే సూక్ష్మ జీవుల సంఖ్య బాగా గణనీయంగా వృద్ధి చెంది గడ్డి వేగంగా కుళ్ళిపోతుంది. ఇలా కాకుండా మార్కెట్లో వరిగడ్డి కుళ్ళడానికి వివిధ డీకంపోజర్‌లు అందుబాటులో వచ్చాయి. ఈ డీకంపోజర్‌లు ఉపయోగించడం వలన బాగా సులువుగా వరిగడ్డి కుళ్ళిపోవడంతో త్వరగా పొలానికి పోషకాలు అందించవచ్చు.

**డీకంపోజర్ ఉపయోగించే విధానం:**

**పూసా డికంపోజర్ :** ఐదు లీటర్ల నీటిలో 250 గ్రాముల బెల్లాన్ని బాగా మరిగించాలి. ఈ ద్రావణం చల్లార్చిన తర్వాత 50 గ్రాముల శనగపిండి, రెండు పూస డికంపోజర్ బిళ్లలు కలిపేసి ఈ ద్రావణాన్ని నాలుగు నుండి ఐదు రోజులు నిలువ పెట్టుకున్నటయితే అందులో ఉన్నటువంటి సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. తయారైన 5 లీటర్ల పూసా డికంపోజర్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలపాలి. ఈ ద్రావణాన్ని పొలంలో సమానంగా పిచికారీ చేసుకోవడం వలన గడ్డి బాగా కుళ్లిపోయి అందులో ఉన్న పోషకాలు భూమికి లభ్యమవుతాయి.

**ఘజియాబాద్ డికంపోజర్ :** 200 లీటర్ల నీటిని తీసుకుని అందులో రెండు కిలోల పౌడర్ చేసిన బెల్లాన్ని వేసి కర్రతో బాగా కలుపుకోవాలి అందులో ఒక ప్యాకెట్ గజియాబాద్ డికంపోజర్ వేసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని ఒకటి రెండు రోజులు నిలువ ఉంచుకొని పొలంలో సమానంగా పిచికారీ చేసుకున్నట్లయితే 10 నుండి 15 రోజులలో సూక్ష్మజీవులు విపరీతంగా పెరిగి గడ్డి బాగా కుళ్ళిపోతుంది.

ఈ విధంగా రైతులు వరిగడ్డిని తగలపెట్టకుండా దమ్ము చేసుకున్నట్లయితే లేదా డీకంపోజర్ ఉపయోగించినట్లయితే భూమిలో ఉండే విలువైన సూక్ష్మ జీవులను కాపాడుకోవచ్చు, పర్యావరణానికి తీవ్ర నష్టం చేయకుండా అరికట్టవచ్చు.

## పాఠకుల స్పందన కోసం..

**వ్యవసాయ పాడిపంటలు** మాస పత్రిక ఏడు దశాబ్దాలకు పైగా తెలుగు రైతాంగానికి తన సేవలు అందిస్తోంది. రైతులకు పంట కాలాల వారీగా వివిధ దశలకు అవసరమయ్యే సూచనలను, సలహాలను అందిస్తోంది. రైతు విజయగాథలను అందిస్తోంది. అలాగే ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను, వాటి ప్రయోజనాలను తెలియజేస్తోంది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన పంటల, ఇతర సమాచారాన్ని అందిస్తోంది. మన పత్రికకు రచయితలుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులు, రైతులు కావాల్సిన సమాచారాన్ని, విశ్లేషణలను అందిస్తున్నారు. అయితే ఈ పత్రిక ప్రయోజనాన్ని పొందే రైతుల నుంచి మేము స్పందన ఆశిస్తున్నాం. రైతులే కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తమ సూచనలను అందిస్తే మరింత మెరుగ్గా తెచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇస్తున్నాం. మీ స్పందనలను పోస్ట్ కార్డుల ద్వారా లేక **tgpadipantalu@gmail.com** కు మెయిల్ ద్వారా తెలియజేయవచ్చు. మీ అందరి స్పందనలతో, సూచనలతో మన **వ్యవసాయ పాడిపంటలు**ను రైతాంగానికి మరింత ప్రయోజనకరంగా రూపొందించుకుందాం. బంగారు తెలంగాణ స్వప్నాలను నిజం చేసుకుందాం.

-సం.

# నీట మునిగిన ఉద్యాన పంటలు తీసుకోవలసిన జాగ్రత్తలు

ఎండి సాదిక్ పాషా, డా.జె. చీనా, డా.ఎస్.మల్లేష్, కె.నాగరాజు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం,
డా.ఎ.నిర్మలా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఇటీవల కురిసిన కుండపోత వర్షాలు, వరదలతో తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అపార నష్టం వాటిల్లింది. భారీ వర్షాలకు లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ చాలా చోట్ల పొలాల నుంచి వరదనీరు బయటకు వెళ్లని పరిస్థితి నెలకొంది. వర్షాలతో నీట మునిగిన పొలాల్లో వరద నీరు బయటకు పోయిన తర్వాత ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

- ❖ పొలాల్లో నిల్వ ఉన్న అదనపు నీటిని బయటకు పంపివేయాలి.
- ❖ లేత తోటల్లో మొక్కలు చనిపోయిన చోట తిరిగి నాటుకోవాలి.
- ❖ కొంచెం నేల వాలిన మెక్కలను లేపి మొదళ్ల వద్దకు మట్టి ఎగదోయాలి.
- ❖ మొక్కలు తిరిగి బలంగా పెరగడానికి అవసరమైన పోషకాల మోతాదును పెంచాలి.
- ❖ వ్యాధి కారక శిలీంధ్రాలను, చీడలను నివారించడానికి తగిన చర్యలను చేపట్టాలి. దీని కోసం స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి.

### అరటి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- ❖ ఈదురు గాలులకు విరిగిపోయిన అరటి తోటలలో గెలలు ఉంటే వాటిని కోసి మార్కెట్ చేసుకోవాలి.
- ❖ లేత అరటి తోటలు (5-7 నెలల వయస్సు) విరిగి పోయినట్లయితే అలాంటి తోటలను శుభ్రం చేసి కొత్త పిలకలను వదిలేయాలి. వదలిన పిలకలకు ప్రతీ 25 రోజులకు ఒకసారి మొక్క ఒక్కింటికీ 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- ❖ 2 లేక 3 నెలల వయసు ఉన్న అరటి మొక్కలు విరిగిపోతే విరిగిన చోట కోసి మరలా ఆ మొక్కలను పెంచవచ్చు. అరటి దుంపలు కుళ్లిపోకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి కలిపి (లేదా) బోర్డో మిశ్రమం 1% దుంప చుట్టూ తడిచేలా నేలలో పోయాలి.

### నీటిలో మునిగిన అరటితోటలో యాజమాన్యం :

- ❖ 3 నెలల కన్నా తక్కువ వయస్సు ఉన్న మొక్కలు 3 అడుగుల లోతు నీటిలో మునిగిపోతే నేల ఆరిన వెంటనే మరలా మొక్కలను నాటుకోవాలి.
- ❖ ఆకులు, గెలలపై 0.5% 13-0-15 (నీటిలో కరిగే ఎరువు మల్టి-కె) వారం రోజుల వ్యవధిలో 3 నుండి 4 సార్లు పిచికారీచేయాలి.
- ❖ సగం తయారైన గెల (75% లోపు పక్వానికి వచ్చిన గెల) లను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి 15 రోజుల లోపు కోసి మార్కెట్ చేసుకోవాలి.

### కూరగాయల పంటల్లో జాగ్రత్తలు :

- ❖ పడిపోయిన కూరగాయల మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు దగ్గరగా మట్టిని ఎగదోయాలి.
- ❖ మొక్క సరిపోయినంత ఆకులు, కొమ్మలతో ఉంటే 2% యూరియా ద్రావణాన్ని వారం వ్యవధిలో 2-3 సార్లు మొక్క తడిచేటట్లు పిచికారీ చేయాలి.
- ❖ కూరగాయ పంటలు కొత్తగా నాటి అవి పూర్తిగా మునిగిపోయి ఉంటే వాటిని తీసివేసి మరలా నాటుకోవాలి.
- ❖ నీట మునిగి తేరుకున్న పంటకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 2.5 గ్రా. సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ❖ వేరుకుళ్లు ఆశించిన చేలల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రా. (లేదా) కార్బండిజమ్ 10 గ్రా. చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

### పసుపు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- వర్షాలు ఆగి, పొలం నుంచి నీరు బయటకు పోయిన తర్వాత వెంటనే పసుపు పంటపై లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.
- పంటలో ఇనుప ధాతులోపం ఏర్పడి లేత ఆకులు పాలిపోయినట్లు కనబడితే, 10 లీటర్ల నీటిలో 50 గ్రా. అన్నభేది,
- ఒక నిమ్మచెక్క రసం, జిగురు మందుతో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.
- నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసినట్లయితే త్వరగా ఆరుతుంది. పైపాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 40 కిలోల పొటాష్‌తో పాటు 200 కిలోల వేపపిండి వేయాలి. ఆకుమచ్చ తెగులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 1 మి.లీ. ప్రాప్తికోనజోల్ ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి.
- దుంపకుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తిస్తే పాదుల్లో మొక్కల చుట్టూ నేలను కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణంతో తడపాలి. తెగులు ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటికి 2.5 గ్రా. రిడోమిల్ మందును కలిపిన ద్రావణంతో తడపాలి.

### మిరప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- ఉరకెత్తిన పొలాల్లో మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల పంచదార కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.
- మొక్కలు తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రా. మెగ్నీషియం సల్ఫేటు కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి.
- ఇనుప ధాతులోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనిపిస్తే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారీ చేయాలి.
- కాపుతో ఉండి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ళ చుట్టూ మట్టిని ఎగదోయాలి. పైపాటుగా ఎకరానికి అదనంగా 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలి.
- పంటను బాక్టీరియా ఆకుమచ్చ, కానోఫొరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- వేరుకుళ్లు ఆశించిన చేలలో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు (లేదా) కార్బండిజమ్ 10 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలి.
- కాయకుళ్లు, కొమ్మ ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా 1 మి.లీ. ప్రోపికోనజోల్ (లేదా) 0.5 మి.లీ. డైఫెన్కోనజోల్ (లేదా) 2.5గ్రా. కాపర్ హైడ్రాక్సైడ్ (లేదా) 2.5 గ్రా. సాఫ్ మందులను లీటరు నీటికి కలిపి, మందులను ఒకటి మార్చి ఒకటి వారం రోజుల వ్యవధిలో 2,3 సార్లు పిచికారీ చేయాలి. గొంగళి పురుగుల నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. (లేదా) అసిఫేట్ 1.5 గ్రా. లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. వంటి కీటక నాశిని మందులను పిచికారీ చేయాలి.

### పూల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- మొక్కలపై 2% యూరియా (లేదా) 1% 13-0-45 (నీటిలో కరిగే ఎరువు మళ్టి-కె) ను వారం రోజుల వ్యవధిలో 2,3 సార్లు పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికొనజోల్ 1 మి.లీ. ను లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1,2 సార్లు పిచికారీ చేయాలి.
- కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. పువ్వులను కోసిన తరువాత, మార్కెట్‌కు పంపేలోపు వాటిని తాత్కాలికంగా బాగా గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిల్వచేయాలి. వీలైనంత త్వరగా పువ్వులను మార్కెట్‌కు పంపాలి.

# గ్లాడియోలస్ సాగులో పాటించే యాజమాన్య పద్ధతులు

డా.ఎం.విజయలక్ష్మి, డా.కె.స్వాతి, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

గ్లాడియోలస్ గ్రాండిఫ్లోరస్ ఇరిడేసి కుటుంబానికి చెందిన ముఖ్యమైన పూల పంట. పూలను స్థానిక, మార్కెట్లో కట్ ఫ్లవర్స్ గా ఉపయోగిస్తారు. వివిధ రంగుల ప్రకాశవంతమైన పువ్వులు గల కాడలను పుష్పగుచ్చాలలోను, ఇంటిలోవల అలంకరణ కోసం ఉపయోగిస్తారు. గ్లాడియోలస్ పూల కాడలుఎక్కువ రోజులు నిలువ ఉండి దూర ప్రాంతాలకు కూడా సరఫరా చేయటానికి అనుకూలం.



**వాతావరణం :** గ్లాడియోలస్ వివిధ వాతావరణ పరిస్థితులలో సాగు చేసినప్పటికి, మొక్క పెరుగుదల, అభివృద్ధికి సమృద్ధిగా సూర్యరశ్మి అవసరం, లేనట్లయితే పూల కాడలు అభివృద్ధి చెందవు. సరాసరి పగటి ఉష్ణోగ్రతలు 15-20 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉండాలి. ఒకవేళ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయినట్లయితే మొక్కలు చలికి దెబ్బతింటాయి. 2-7 ఆకుల దశలో తక్కువ ఉష్ణోగ్రతలు (2-5 డిగ్రీ సెంటీగ్రేడ్) ఎక్కువ రోజులు నమోదు అయితే కాడలోని పూల సంఖ్య బాగా తగ్గిపోతుంది.

**నేలలు :** గ్లాడియోలస్ సాగుకు సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్న తేలిక పాటి నేలలు బాగా అనుకూలం. 5.5 నుండి6.5 ఉదజని సూచిక ఉన్న మురుగు నీటి వసతి కలిగిన తేలికపాటి ఆమ్ల నేలలు సాగుకు బాగ అనుకూలమైనప్పటికి, ఉదజని సూచిక 5 నుండి 8 వరకు గల నెలల్లో కూడా పంట సాగుచేయవచ్చును. ఉదజని సూచికఎక్కువగా ఉన్నపుడు భూమికి సేంద్రియ ఎరువులు ఎక్కువగా అందించటం ద్వారా తీవ్రతను తగ్గించవచ్చును.

**రకాలు :** ప్రపంచం మొత్తంలో చాలా రకాలు సాగులో ఉన్న ముఖ్యమైన గ్లాడియోలస్ రకాలు ధీరజ్,షాగున్, కాండీమాన్, స్నోవైట్, ట్రేడర్ హార్న్ఎక్కువగా సాగుకు ఉపయోగిస్తారు.

**ప్రవర్ధనం :** గ్లాడియోలస్ ను వాణిజ్య పంథాలో దుంపల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. తాజా దుంపలలో 70 నుండి 90 రోజుల వరకు నిద్రావస్థ ఉంటుంది, కాబట్టి భూమిలో తీసిన వెంటనే దుంపలు మొలకెత్తవు . 4 సెం. మీ వ్యాసం ఉన్న దుంపలు పూల ఉత్పత్తికి అనుకూలం. బల్ల పరుపుగా ఉన్న దుంపలకంటే బొంగరం ఆకారంలో ఉన్న దుంపల నుండి పూల దిగుబడి బాగా ఉంటుంది. చిన్న పరిమాణంలో ఉన్న పిల్ల దుంపలను 2 లేక 3 సార్లు వరుసగా నాటినప్పుడు మాత్రమే పూలు రావటానికి అవకాశం ఉంది. పిల్ల దుంపలను సమతుల మడులలో దగ్గరగా నాటుతారు. దుంపలను నాటటానికి ముందు 24 గంటలు నీటిలో నానబెట్టినట్లయితే సమానంగా ఒకేసారి మొలకలు వస్తాయి. దుంపల నుండి వచ్చిన పెద్ద దుంపలను పూలకాడల ఉత్పత్తి కొరకుఉపయోగిస్తారు.

**నాటటం :** గ్లాడియోలస్ లను సాధారణంగా జూన్ నుండి నవంబర్ వరకు నాటినప్పటికి, అవసరాన్ని బట్టి డిసెంబర్ మాసం వరకు నాటుకోవచ్చును. మార్కెటుకు ఒకే విధమయిన సరఫరా కోసం 15 రోజుల వ్యవధిలో నాటుకోవటం మంచిది. దుంపలను నాటుకొనే ముందు దుంప మీద ఉన్న పొలుసులను తీసివేసి మాంకోజెబ్ 2 గ్రా లేదా కార్బండిజమ్ 1 గ్రా మందును లీటరు నీటికి కలిపి దుంపలను మందు ద్రావణంలో 15 నుండి 20 నిమిషాలు ఉంచినట్లయితే దుంపల ద్వారా వ్యాప్తి చెందే



రోగాలను నిరోధించవచ్చును. నిద్రావస్థలేని దుంపలను మాత్రమే నాటుకోవాలి. దుంప భాగంలో ఆవిర్భవించిన వేరు మొగ్గల వలన దుంపలలో నిద్రావస్థ తొలిగి పోయినట్లుగా గుర్తించవచ్చును. ఇసుక నేలలో సమతుల మడులలో నాటుకొన్నపటికి, బరువు నేలలో నాటేటపుడు బోదెల మీద కాని లేదా ఎత్తు మడుల మీద కాని నాటుకోవాలి. గ్లాడియోలస్ దుంపలను 30×20 సెం. మీ దూరంలో, 5-8సెం. మీలోతులో నాటుకోవాలి. నాటేటప్పుడు భూమిలో తగినంత తేమ ఉండే విధంగా చూసుకుంటే అన్ని మొలకలు ఒకేసారి వస్తాయి.

**ఎరువులు :** గ్లాడియోలస్ కు అందించవలసిన ఎరువుల మోతాదు వాతావరణం, నేల స్వభావాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 నుండి 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 15 -20 కిలోల నత్రజని, 30-35 కిలోల భాస్వరం, 30-35 కిలోల పోటాష్ నిచ్చే ఎరువులను అందించాలి. తరువాత పై పాటుగా 30-35 కిలోల నత్రజని రెండు దఫాలుగా అంటే 3 అకులు, 6 ఆకుల దశలో అందించాలి. పూల నాణ్యత పెంచటానికి సూక్ష్మ పోషకలయిన ఐరన్ సల్ఫేట్ 0.75 %, 0.5 % జింక్ సల్ఫేట్ ని 3 అకులు, 6 ఆకుల దశలో మొక్కలపై పిచికారీ చేయాలి.

**అంతరకృషి, నీటి యాజమాన్యం :** దుంపలు నాటే సమయంలో భూమిలో తగినంత తేమ ఉండాలి. అన్ని దుంపలు మొలకెత్తే వరకు నీటి తడి ఇస్తు ఉండాలి. అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి నీటి తడి ఇవ్వాలి. పుష్పించే సమయంలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి.

మొక్కలు పడిపోకుండా మట్టిని మొక్కచుట్టు ఎగదోయాలి. దీనితో పాటు మొక్కలు పుష్పించే దశలో తప్పనిసరిగా ఊతమివ్వాలి. ఈ దశలో ఊతమివ్వన్నట్లయితే పూల కాడ బరువు వలన మొక్కలు ఒక పక్కకు వాలి పడిపోతాయి. ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నపుడు ఊతమివ్వడం సాధ్యం కాదు కనుక వెదురు కర్రలను మొక్క వరుసల చివర ఇరువైపుల దగ్గరగా భూమిపై నిలబెట్టి, నారను ఈ రెండు కర్రలకు సమాంతరంగా రెండు వరుసలలో చుట్టినట్లయితే మొక్కలు పడిపోకుండా నిలబడి ఉంటాయి.

**కోత :** రకాన్ని బట్టి గ్లాడియోలస్ లో దుంపలు నాటిన 60 నుండి 100 రోజులో పూల కాడలు వస్తాయి. కాడ అడుగు భాగంలో ఒక మొగ్గలో రంగు ఏర్పడినప్పుడు కాడలను కోయాలి.సాధారణంగా చల్లని సమయంలో అంటే ఉదయం లేదా సాయంత్రం వేళలో పూల కాడలను పదునైన కత్తితో కోయాలి. కోత సమయంలో మొక్కకు నాలుగు ఆకులు ఉండిపోయే విధంగా చూడాలి. దీని వలన పిల్లదుంపలూ, దుంపలు బాగా అభివృద్ధి చెందుతాయి. కాడలను కోసిన వెంటనే సిట్రిక్ ఆమ్లం లేదా ఏదేని ప్రిజర్వేటివ్ కలిగిన నీటిలో చివరలు మునిగేటట్లు ఉండాలి.

**దిగుబడి :** పూల కాడల దిగుబడి సాగు చేసే రకం, దుంప పరిమాణం, మొక్కల సాంద్రత,, పాటించిన యాజమాన్య పద్ధతులు బట్టి మారుతూ ఉంటుంది. సాధారణంగా ఒక్క మొక్క నుండి ఒక్క పూవుకాడ, దుంప వస్తుంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక మొక్కల సాంద్రత ఉన్న ఒక్క ప్రామాణిక ప్రదేశం నుండి అధిక దిగుబడులు సాధించవచ్చును.

**వర్గీకరణ, ప్యాకింగ్ :** మార్కెట్‌కు పూల కాడలను సరఫరా చేసే ముందు కాడ పొడువు, కాడలోని పూల సంఖ్యను బట్టి వర్గీకరించాలి. కాడ వంకరలు లేకుండా పొడవుగా, పూలు ఎక్కువుగా విచ్చుకోకుండా, పురుగులు, తెగుళ్ళు ఆశించకుండా ఉండాలి . ఇలా వర్గీకరించిన కాడలను 10 నుండి 20 ఒక కట్టగా కట్టి రబ్బరు బాండు వేయాలి . స్థానిక మార్కెట్ కు అయితే వదులుగాను, దూర ప్రదేశాలకు ఆయితే గట్టిగా కట్టి సరఫరా చేయాలి. ఇలా కట్టిన కట్టలను కార్డు బోర్డు లేదా చెక్క పెట్టెలలో ఉంచి సరఫరా చేయాలి. దూరప్రదేశాలకు సరఫరా చేయటానికి . శీతలీకరణ (రెఫ్రి జిరేటర్) వాహనాన్ని ఉపోయోగించు కోవాలి.సరఫరా చేసేటప్పుడు కాడలను నిలువుగా ఉంచి సరఫరా చేస్తే కాడల చివరలు భూమ్యాకర్షణకు గురికావు.

**సొసయిటీ ఆఫ్ అమెరికన్ ఫ్లోరిస్ట్‌లు వర్గీకరించిన ప్రమాణాలు**

| రకం | కాడ పొడువు (సెం.మీ ) | కాడలో పూల సంఖ్య (తక్కువలో తక్కువ ) |
|---|---|---|
| ఫ్యాన్సి | 107, ఆపైన | 16 |
| స్పెషల్ | 96-107 | 14 |
| స్టాండర్డ్ | 81-96 | 12 |
| యుటిలిటీ | 81, ఆపైన | 10 |

భారతదేశంలో ప్రామాణికతను ఏ, బి, సి, డి రకాలుగా వర్గీకరించారు.

**దుంపల కోత, నిలువ :** పూల కాడలు కోసిన 50-60 రోజుల తరువాత, ఆకులు పసుపు వర్ణంలోకి మారి ఎండిపోతున్నపుడు దుంపలను తవ్వి తీసికోవాలి. దుంపలను తవ్వితీయటానికి 3-4 వారాల ముందు నీటి తడి ఇవ్వటం ఆపేయాలి. దుంపలను తీయటానికి ముందు తేలికపాటి తడి యిచ్చినట్లైతే భూమి గుల్లబారి దుంపలను తేలికగా తవ్వి తీయటానికి వీలవుతుంది. దుంపలను ఆలస్యంగా తవ్వి తీయటం వలన తరువాత పంట కాలంలో కాడలు పొడువుగాను, ఆలస్యంగాను వస్తాయి. ఒకవేళ తొందరగా తీసినట్లయితే పూల కాడలు వస్తాయి.

దుంపలను, తవ్వి తీసివేసిన తరువాత వీటికి అంటుకొని ఉన్న మట్టి, పై పొరను తీసివేయాలి. తరువాత తల్లి, పిల్ల దుంపలను వేరుచేసి శిలింద్ర నాశక మందుతో శుద్ధి చేసి 4-5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల చల్లని గదిలో నిలువ చేయాలి. అయితే సదుపాయాల లోపాల వలన అందరికి చల్లని గదిలో నిలువ చేయటం సాధ్యం కాదు. ఇటువంటి పరిస్థితుల్లో గాలి బాగా చొరబడె గదిలో దుంపలను ప్లాస్టిక్ ట్రేలలో ఉంచి విలువ చేయవచ్చు. ఇలా నిలువ చేసిన దుంపలను తరుచుగా పరీక్షిస్తు రోగాల బారిన పడిన తల్లి, పిల్ల దుంపలను తీసివేయాలి.

తల్లి, పిల్ల దుంపలు కొంతకాలం నిద్రావస్థలో ఉంటాయి. నిద్రావస్థ ఉష్ణప్రదేశాలలో ఎక్కువుగా ఉంటుంది. నిద్రావస్థ తొలిగించటానికి దుంపలను 35 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత 10 రోజుల పాటు లభించే విధంగా చేసి తదుపరి జీరో డిగ్రీ సెంటీగ్రేడ్ వద్ద 10-15 రోజుల పాటు నిలువ ఉంచితే నిద్రావస్థి పూర్తిగాతొలగిపోతుంది. దీనిలో పాటు పెరుగుదల నియంత్రించే కారకాలయిన ఇథరిల్ 1000 పిపిఎం. (1 మి.గ్రా.)లేదా థయోయూరియ 500 పి.పి.ఎం. (5 మి.గ్రా.) లీటరు నీటిలో కలిపి 24 గంటలు పాటు నానబెట్టినట్లయితే దుంపలలో నిద్రావస్థ తొలిగిపోయి మొలకలు వస్తాయి.

# ఔషధ గుణాలు - వంట దినుసులు

ఎ.ప్రశాంతి, శాస్త్ర సాంకేతిక నిపుణులు, గృహ విజ్ఞాన విభాగం, కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట, కరీంనగర్ జిల్లా

అప్పుడప్పుడు వచ్చే అనారోగ్యాలకు వంటిల్లు ఓ వైద్యశాల. మిరియాలు, సొంటి, లవంగాలు, అల్లం, వెల్లుల్లి, ఎండుమిర్చి, దాల్చిన చెక్క, పసుపు, ఆవాలు, జీలకర్ర, సోంపు గింజలు మొదలైనవన్నీ ఆహార పదార్థాలకు రంగును రుచిని ఇస్తాయి. వీటితోపాటు ఆరోగ్యాన్ని అందిస్తుంటాయి. సువాసన ద్రవ్యాలుగా అనాది నుంచి వంటింట్లో స్థానం సంపాదించుకున్న కొన్ని మసాలా దినుసులలో ఔషధ గుణాలను ఇప్పుడు చూద్దాం

### ఏలకులు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి :

- నోటి దుర్గంధం తక్షణం నివారించబడుతుంది.
- తీవ్రమైన పంటి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
- అతిసార వ్యాధి నివారణకు ఏలకులు పొడిని తేనెలో కలిపి తీసుకుంటే దివ్య ఔషధంగా పనిచేస్తుంది.
- నిస్సత్తువను అదుపు చేస్తుంది.
- పైత్య, వాతం నివారించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి
- కఫం, రక్త విరోచనాలు, దృష్టి దోషం, దురద, వాంతుల నుంచి ఏలకుల ద్వారా ఉపశమనం పొందవచ్చు.
- పుచ్చగింజలతో కలిపి ఏలకుల్ని తీసుకోవడం ద్వారా కిడ్నీలోని రాళ్ళను కరిగించవచ్చు. ఏలకుల పొడి చేసి కలిపి వాడితే మూత్రం సాఫీగా వస్తుంది

### లవంగాలు :

- దంతాలకు మేలు చేసే లవంగాలను ఆహార పదార్థాలలో విరివిగా ఉపయోగిస్తారు. లవంగాలు నూనె తీసినవి, తీయనివి కూడా లభిస్తాయి. ఘాటు తక్కువగా ఉండి చవకగా దొరుకుతాయి. పైత్యం, కఫం, రక్త విరోచనాలు, వాంతులు, పంటి నొప్పి, ఎక్కిళ్ళు లవంగాలు నిరోధిస్తాయి
- అజీర్ణం, కడుపులో వ్యర్థంగా గడబిడకు కారణమయ్యే వాయువులను సమర్థవంతంగా ఎదుర్కొంటాయి.

### ధనియాలు ఇవి చాలా ప్రాచీనమైనవి :

- ఎన్నో దేశాలలో ధనియాల వాడకం ఉంది. అజీర్ణం వాంతులు నివారిస్తాయి.
- రోగుల్లో పేగులలో అస్తవ్యవస్థ పరిస్థితిని, వ్యర్థ వాయువుల తయారీలను అదుపు చేస్తాయి.
- అతి దాహం, అలసట, జలుబు, దగ్గులను అరికడతాయి.
- ఆహారానికి రుచిని చేకూర్చుడంతో పాటు కమ్మని వాసన కలుగజేసే ధనియాలు సులభంగా మొలకెత్తుతాయి.

### జీలకర్ర :

- ప్రతిరోజు మనం తాలింపు సామానులో ఉపయోగించే ఆరోగ్యకరమైన రుచికరమైన మసాలా దినుసులలో జీలకర్ర ఒకటి.
- దీన్ని దేశంలో అన్ని ప్రాంతాల వారు వాడుతుంటారు. కొందరు జీలకర్ర పొడి చేసి వాడుకుంటారు.
- వేపుడు కూరల్లో వాడుతున్నారు.
- అతిసారం, ఉదర సంబంధ రోగాలు నరిచేయుండంలో జీలకర్ర బాగా ఉపయోగపడుతుంది
- జీర్ణక్రియలో చురుకుగా పాల్గొంటుంది.

### జాజికాయ :

- దీన్ని నట్ మగ్‌గా వ్యవహరిస్తారు.
- కొన్ని ప్రత్యేక వంటకాలలో మసాలా (ద్రవ్యంగా దీన్ని చేరుస్తారు. రోజు వాడే మసాలాలలో ఇది వాడరు.
- మలేరియా జ్వరాన్ని, విరోచనాలను అరికడుతుంది.




- ❖ జాజికాయలను రాతి మీద అరగదీసి వచ్చిన గంధాన్ని ప్రాథమిక దశలో కుష్టు వ్యాధికి లేపనంగా వాడవచ్చు.
- ❖ తేలికగా ఉండే జాజికాయల కంటే బరువైన కాయలు మంచిది.
- ❖ ఔషధాల రూపంలో అధికంగా వాడుతుంటారు.
- ❖ కడుపు నొప్పి, దగ్గు, జలుబు నివారించడానికి పిల్లలకు వాడుతుంటారు

**మిరియాలు :**

- ❖ వీటిలో రెండు రకాలు ఉన్నాయి. ఎర్రవి, నల్లవి.
- ❖ నల్లమిరియాలు ఆహార పదార్థాలలో ఎక్కువగా ఉపయోగిస్తుంటారు.
- ❖ అనాదిగా మంచి ఔషధ విలువలు ఉన్న దినుసులుగా మిరియాలు ప్రాముఖ్యత పొందాయి.
- ❖ వీటిని పాశ్చాత్య దేశాలలో ప్రజలు వాడుతున్నారు.
- ❖ జలుబు, దగ్గులకు దివ్య ఔషధం. కషాయంగా కాచి తాగేవారు, టీలో వేసుకొని తాగేవారు ఉన్నారు.
- ❖ వాతం, శ్వాస సంబంధ వ్యాధుల్ని నయం చేస్తాయి. శరీరానికి ఉత్తేజాన్ని కలుగజేస్తాయి. అపస్మారకం, వణుకు ను అరికడతాయి.
- ❖ అజీర్ణం, మలేరియాలలో ఇవి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తాయి.
- ❖ ప్రాథమిక దశలో కుష్టు వ్యాధిని నివారిస్తాయి.
- ❖ పొడుగ్గా ఉండే మిరియాలు నిద్రలేమి పోగొడతాయి.

**మెంతులు :**

- ❖ ఆహార పదార్థాలలో జీర్ణ క్రియ కు దోహదం చేస్తాయి. వాతాన్ని హరిస్తాయి.
- ❖ క్రమం తప్పకుండా ఉపయోగించడం వలన కడుపులో పురుగులు, నొప్పి, పొట్ట మెలిమెట్టినట్లు ఉండడం వంటివి తగ్గుతాయి.
- ❖ కీళ్ల నొప్పులు, నడుము నొప్పికి మెంతులు మంచి ఔషధం.
- ❖ మధుమేహ వ్యాధి నివారణలో మెంతులు పాత్ర గణనీయమైనది.
- ❖ కాలేయ శుద్ధికి, గౌట్ వ్యాధికి, రికెట్స్ వ్యాధికి మెంతులు ను ఉపయోగిస్తారు

**సోంపు గింజలు :**

- ❖ ప్రాచీన కాలం నుండి సోంపు గింజలను నోటి దుర్వాసన నిర్మూలనలో వాడేవారు.
- ❖ ఆకుపచ్చ సోంపు గింజలు సువాసన వెదజల్లుతూ ఆరోగ్యాభివృద్ధి కి తోడ్పడతాయి.
- ❖ మంచి మౌత్వాష్, యాంటీసెప్టిక్, జీర్ణ క్రియలలో దీని పాత్ర ఎంతో ఉంది.
- ❖ శరీరంలో వేడిని హరిస్తుంది. ఎండబెట్టిన సోంపు గింజలు గొప్ప జీర్ణ కారిణిగా పనిచేస్తాయి.
- ❖ ఆస్తమా నివారణలో కూడా దీనిని వాడతారు.



**దాల్చిన చెక్క:**

❖ దాల్చిన చెక్కను రుచికి, సువాసనకు వాడుతారు.

❖ వేడి శరీరం గలవారు దీన్ని తక్కువగా తినడం మంచిది.

❖ పొట్టలోని ఇబ్బందుల్ని తగ్గిస్తుంది. గొంతుకి ఇది మంచి ఔషధం.

❖ ఇది శరీర రంగులో నిగారింపు తీసుకు రాగలదు. కనుకనే లేపనాలలో సౌందర్య సాధనాలలో దీనిని వాడుతారు.

❖ గరం మసాలాల్లో దీని వాడకం అధికం

**గసగసాలు :**

❖ ఇది అరుదు గాను, ఖరీదుగాను లభించే పదార్థం.

❖ వీటి నుంచి తీసే నూనె అతిసారం, విరోచనాలకు మంచి మందు.

❖ కాలిన గాయాలు, బొబ్బలు, గసగసాలతో నయం చేయవచ్చు.

**ఇంగువ :**

❖ దీనిని ముఖ్యంగా తాలింపులో సువాసన ద్రవ్యంగానే ఉపయోగించినప్పటికీ ఔషధ గుణాలు ఇంగువలో అధికంగా ఉన్నాయి.

❖ ఇది గట్టిపడిన పాల జిగురు వంటి పదార్థం అని చెప్పవచ్చు.

❖ రుచికరాన్ని ప్రసాదించే ఇంగువ ఆరోగ్యకారిణి కూడా.

❖ గ్యాస్ట్రబుల్ సమస్యను నివారించి పొట్టకు మేలు చేస్తుంది.

❖ వాతం నొప్పులు, దగ్గు నివారిస్తుంది.

❖ నాడీ వ్యవస్థను క్రమబద్ధం చేస్తుంది.

❖ జీర్ణ క్రియ, శ్వాసక్రియలకు చురుకైన ఔషధం.

❖ కలరా వ్యాధిలో యాంటీబయాటిక్ గా పనిచేస్తుంది

**ఆవాలు :**

❖ నిలువ పచ్చళ్ళలోనూ, పోపులోను ఆవాల ఉపయోగం అందరికీ తెలిసిందే. ఆవాలు జీర్ణశక్తికి దోహదపడతాయి. ఆకలిని పుట్టిస్తాయి.

❖ కఫం, పైత్యంను నివారిస్తాయి. ఎలర్జీలను నిరోధిస్తాయి.

❖ దీని ఘాటు నాసికా రంధ్రాన్ని శుభం చేస్తుంది

**వాము :**

❖ పూర్వం నుంచి జీర్ణక్రియలో ప్రధాన పాత్ర పోషించే దినుసుగా వాముకు ప్రత్యేకత ఉంది.

❖ కొన్ని ఆహారాలకు వాము వల్లనే సుగంధం ఏర్పడుతుంది.

❖ దీనివలన కడుపులో వికారం, గ్యాస్ ట్రబుల్ నివారించబడటమే కాక కఫం, గొంతులో గరగర కూడా తగ్గుతాయి.

**సబ్జా గింజలు :**

❖ సబ్జాఆకులను సేవించడం ద్వారా శ్వాసక్రియలో ఇబ్బందులను, గొంతు తడి ఆరిపోవడాన్ని అధిగమించవచ్చు.



❖ ఎక్కువగా సబ్జా గింజలు వాడితే పాలిచ్చే తల్లులలో పాల ఉత్పత్తి ఆగిపోతుంది.

**చింత చెట్టు :**

❖ పచ్చి చింతకాయలు రక్త శుద్ధికి సహకరిస్తాయి.

❖ చింతచిగురు శరీరం మీద మంటను, తామరను తగ్గిస్తుంది.

❖ చింత పువ్వు మూత్ర వ్యాధుల్ని నివారిస్తుంది.

**పసుపు :**

❖ పసుపు మనకు సర్వరోగ నివారిణి గా ఉంటుంది.

❖ అనేకమైన అనారోగ్యాలకు ఇది మంచి ఔషధం.

❖ దెబ్బలు, పుండ్లు కాలిన గాయాలలో పసుపు వాడుతున్నారు.

❖ వాతం, పిత్తం, కఫంను నివారిస్తుంది.

❖ రక్తశుద్ధికి సహకరిస్తుంది. యాంటీబయాటిక్ ఇది

**శొంఠి :**

❖ బాగాముదిరిన అల్లాన్ని ఎండబెట్టి శొంఠి తయారు చేస్తారు.

❖ కనుక అల్లంలో ఉండే గుణాలు శొంఠిలో కూడా చూడవచ్చు.

❖ అజీర్ణానికి మంచి ఔషధం.

❖ వయస్సు మళ్ళిన వారిలో జీర్ణ క్రియ కు బాగా దోహదం చేయగలవు.

❖ కడుపుబ్బరం, కడుపులో మంట, గ్యాస్ ట్రబుల్ నివారిస్తాయి.

❖ గుండె దడ, కాళ్ళు చేతులు వణకడం వంటి సమస్యలకు పాలల్లో శొంఠి పొడి వేసి తాగించడం వలన ఉపశమనం దొరుకుతుంది.

❖ అల్లం అజీర్ణాన్ని అరికడుతుంది. గ్యాస్ ట్రబుల్ను నివారిస్తుంది.

**వెల్లుల్లి :**

❖ జీర్ణ క్రియ కు దోహదం చేస్తుంది.

❖ ఏ ఇతర పదార్థాలతో కలిపి తీసుకోకుండా పరిగడుపున దీన్ని తీసుకోవడం ఉత్తమం.

❖ సహజమైన యాంటిసెప్టిక్.

❖ వెల్లుల్లి రసం చర్మవ్యాధుల నివారణలో వాడతారు. ఈ రసానికి కొంత నీటిని చేర్చి లోపలకు తీసుకుంటే అల్సర్లు నయమవుతాయి.

❖ వెల్లుల్లి ఆకులు ఆస్తమాను నివారిస్తాయి. హైబీపీ, క్యాన్సర్ ట్యూమర్స్ ను తగ్గిస్తాయి.

❖ వెల్లుల్లి రేకుల్ని పొగ వేయడం ద్వారా దోమలను పారదోలవచ్చు.

కాబట్టి తరతరాలుగా మనం వాడే పైన చెప్పబడిన సుగంధ ద్రవ్యాలలో మసాలా దినుసులు ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. కాబట్టి మనకు తెలియకుండానే మన చుట్టూ ఎన్నో రకాల ఔషధ గుణాలున్న పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి అవగాహనతో వీటి గురించి తెలుసుకొని ఆచరణలో పెట్టడం ద్వారా ఆరోగ్యాన్ని పొందిన వారమవుతాము. ఈ సమాచారాన్ని అందరికీ చేరవేద్దాం.

# పెరటి కోళ్ల పెంపకం

డా.డి.వినయ్, డా.జి.కిరణ్ రెడ్డి, డా.ఎం.గోవర్ధన్, డా.సి.ఎచ్. ప్రగతి కుమారి, డా.ఎం.శరత్‌చంద్ర,
సమగ్ర వ్యవసాయ పద్ధతుల విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన దేశంలో రైతులు ఎక్కువగా ఏకపంట విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏకపంట విధానం లాభదాయకంగా ఉండకపోగా భూసారాన్ని, వాతావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే వ్యవసాయ అనుబంధ రంగాలని కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. రైతులు తమ కమతంలో ప్రణాళికా బద్ధంగా కుటుంబ పోషకవసర పంటలు, పండ్ల తోటలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు, మేకలు, గొర్రెలు, కోళ్ళు, తేనెటీగలు తదితర అనుబంధ వ్యాపకాలను చేపట్టే విధానాన్ని మిశ్రమ వ్యవసాయం అంటారు.

ఈ విధానంలో ప్రతి రైతు పెరట్లో 50 వరకు కోళ్ళను పెంచుకోవచ్చు. అందుబాటులో ఉన్న కీటకాలు, గడ్డిగింజలు తిని అధిక గుడ్ల దిగుబడి కోసం గ్రామప్రియ, గిరిరాజ, రాజశ్రీ, మాంసం కోసం రాజశ్రీ, వనరాజ, అసిల్, కడక్‌నాథ్ జాతులను ఎంపిక చేసుకోవాలి. పెరటి కోళ్ళకు రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండడంతో ఈ కోళ్ళు కొన్ని ప్రమాదకర వ్యాధులను తట్టుకొని జీవించగలవు. వీటిపై అధిక శ్రద్ధ అవసరం లేకుండా మన పనులు చూసుకుంటూనేపెరటి కోళ్ళ పెంపకాన్ని అదనపు ఆదాయవనరుగా మార్చుకొని జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చు.

**అనువైన జాతులు :**

**రాజశ్రీ కోళ్ళు :** ఈ జాతి కోళ్ళను శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వారు రూపొందించారు. ఈ జాతి కోళ్ళకి రోగనిరోధక శక్తి ఎక్కువ. ఇది దేశీ నాటుకోడిని పోలి ఉండి ముదురు ఎరుపు రంగులో బలిష్టంగా ఉంటుంది. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొని అధిక మాంసం, గుడ్లు అందించగలవు. గుడ్లు ప్రత్యేకంగా గోధుమ రంగులో ఉంటాయి. ఒక రోజు కోడిపిల్ల బరువు 28-40 గ్రా. ఉంటుంది. నెలకు 250 గ్రా. చొప్పున పెరుగుతుంది. ఇరవై వారాల వయస్సు నుండి గుడ్లు పెట్టడం మొదలు పెడతాయి. ఇవి సంవత్సరానికి దాదాపు 160-170 గుడ్లు పెడతాయి.

**వనరాజ కోళ్ళు :** ఈ జాతిని జాతీయ కోళ్ళ పరిశోధనా స్థానం, రాజేంద్రనగర్ వారు అభివృద్ధి పరిచారు. ఇవి పెరట్లో పెంపకానికి అనువుగా ఉంటూ అధిక సంఖ్యలో గుడ్లు, మాంసాన్ని ఇస్తాయి. వీటి కాళ్ళు పొడవుగా ఉండడం వలన కుక్కలు, పిల్లులు, గద్దల బారి నుండి తప్పించుకోగలవు. పెట్టలు సంవత్సరానికి 150 గుడ్ల వరకు పెడతాయి. ఈ కోళ్ళు 5 నెలల వయస్సు నాటికి 2.5 కిలోల వరకు బరువు పెరిగి అధిక పోషకాలతో కూడిన మాంసాన్ని అందిస్తాయి. ఆరు వారాల వయస్సు దాటిన తర్వాత పెరటి వాతావరణానికి అలవాటు చేసి పెరట్లో తిరగడానికి వదిలివేయాలి.

**గిరిరాజా కోళ్ళు :** ఈ జాతి కోళ్ళను బెంగుళూరు వ్యవసాయ విశ్వవిద్యాలం వారు అభివృద్ధి చేశారు. ఇవి 3.5 కిలోల నుంచి 5 కిలోల వరకు బరువు పెరిగి ఏటా 140-169 గుడ్లు పెడతాయి. 8 వారాల వయస్సులో 1300 గ్రా. వరకు వస్తాయి. 9 వారాల వయస్సులో 3.6 కిలోల బరువు వస్తాయి. ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటాయి. వీటి బరువు ఎక్కువగా ఉండడం వలన తొందరగా కుక్కులు, పిల్లులు, నక్కలకు దొరుకుతాయి.

**గ్రామ ప్రియ కోళ్ళు :** అధిక వ్యాధి నిరోధక శక్తి కలిగిన ఈ కోళ్ళు ఆరోగ్యకరమైన గుడ్లని అందిస్తాయి. ఒకటిన్నర సంవత్సరంలో 250 గుడ్ల వరకు పెడతాయి. వీటి గుడ్లు గోధుమ రంగులో ఉంటాయి. ఇవి 6 నెలల వయస్సు వచ్చే సరికి దాదాపు రెండున్నర కిలోల బరువు పెరుగుతాయి. ఇవి మన పెరట్లో కలియతిరుగుతూ క్రిమి కీటకాలను, గడ్డిజాతి మొక్కలను, పంట వ్యర్థాలను, ధాన్యపు గింజలను ఆహారంగా తీసుకొని జీవిస్తాయి.

**కడక్‌నాథ్ కోళ్ళు :** ఇది మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందినది. ఈ కోడి మాంసంలో మాంసకృత్తులు ఎక్కువగా, కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. 6 నెలల వయస్సు నుండే గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయి. సంవత్సరానికే పంట వ్యర్థాలపైన అరిగించుకోవడం వీటి ప్రత్యేకత. కోడి పిల్లలకు మొదటి వారాల పాటు

బ్రూడింగ్ పద్ధతిలో వేడిమి అందజేయడం అవసరం. ఆ తర్వాత పెరటి పెంపకానికి అలవాటు చేయవచ్చు. దీనికి అధిక డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు దీని పెంపకానికి ఆసక్తి చూపిస్తున్నారు.

**పెరటి కోళ్ళ పెంపకంలో మెళకువలు :** కోళ్ళకు సకాలంలో వైరస్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. వయస్సుని బట్టి టీకాలివ్వాలి. ఒక రోజు వయస్సు కోడిపిల్లలకు మారెక్స్ వ్యాధికి 4-7 రోజుల వయస్సు పిల్లలకు రాణికెట్ వ్యాధికి, 14-18 రోజులప్పుడు గంభీరు వ్యాధికి, 35 రోజుల దశలో రాణికెట్ వ్యాధికి, 6-7 వారాలప్పుడు పౌల్ వ్యాధికి టీకాలివ్వాలి.

చిన్న పిల్లల పెంపకంలో మొదటి 6 వారాలు కీలకమైనవి. ఈ సమయంలో కోడి పిల్లలు తన శరీర ఉష్ణోగ్రతను తనకు తానుగా నియంత్రించుకోలేదు. కావున పిల్లలను బ్రూడర్ కింద ఉంచి తగిన వేడి లభించేటట్లు చేయాలి. దీన్ని బ్రూడింగ్ అంటారు. ప్రతి కోడి పిల్లకు మొదటి వారం 95 డిగ్రీల ఫారన్ హీట్ కల్పించి ఆ తర్వాత 5 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత చొప్పున తగ్గిస్తూ 6 వారాల వరకు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో కోడి పిల్లలకు దాణా, నీటిని అందించాలి. మొదటి 6 వారాల వరకు కోడి పిల్లలు 500 గ్రా. శరీర బరువు కలిగి ఉంటాయి. తర్వాత కోడి పిల్లలను బయటకు విడిచిపెట్టవచ్చు.

**లిట్టరు యాజమాన్యం :** డిప్ లిట్టరు పద్ధతిలో అంటే కోళ్ళను నేలపైన లిట్టరు మెటిరీయల్ పరచి పెంపకం చేసినప్పుడు లిట్టరునందు తేమ లేకుండా చూడాలి. తేమ ఎక్కువ అయితే కాక్సిడియోసిస్ అనే అంతర పరాన్న జీవి వ్యాధి సంభవిస్తుంది. లిట్టరులో తేమ చేరి ముద్దలు కాకుండా ఉండడానికి క్రమం తప్పకుండా లిట్టరును కలియబెట్టాలి. లిట్టర్‌లో తేమను తగ్గించడానికి పొడి సున్నం కలపవచ్చు. వాడిన లిట్టరును మరల వాడకూడదు.

**దాణా యాజమాన్యం :** కోళ్ళ పెంపకానికి అయ్యే ఖర్చులో 70 శాతం వరకు ఒక దాణాకే ఖర్చు అవుతుంది. కానీ పెరటి కోళ్ళ పెంపకానికి దాణా ఖర్చు తక్కువగా ఉంటుంది. పెరటి కోళ్ళను పగటి వేళలో ఇంటి పెరటిలో, పచ్చిక బయళ్ళు పొలాల్లో దొరికే గడ్డి గింజలు, కీటకాలు, నత్తలు, చెదలు మొదలగు వాటిని ఆహారంగా తీసుకుంటాయి. మొక్కజొన్న / సజ్జలు / జొన్నలు / రాగులు / నూకలు 50 పాళ్ళు, వరి / గోధుమ తవుడు 20 పాళ్ళు, సోయాబీన్ / వేరుశనగ / పొద్దుతిరుగుడు / నువ్వుల చెక్క 28 పాళ్ళు, విటమిన్, లవణ మిశ్రమం 2 పాళ్ళు కలిపి దాణాని తయారు చేసుకోవచ్చు.

**మార్కెటింగ్ :** రైతులు కోళ్ళు ఎక్కువగా బరువు పెరగడానికి చూడకుండా మార్కెటింగ్ బరువు వచ్చిన నాటినుండి మార్కెటింగ్ ప్రారంభించాలి. మార్కెటింగ్ కోసం దళారులను, మధ్య వర్తులను ఆశ్రయించకుండా సమీప మార్కెట్లలో, స్థానికంగా స్వతహాగా మార్కెటింగ్ చేస్తే ఎక్కువ లాభాలను పొందవచ్చు. సాధ్యమైనంత వరకు కోళ్ళు 1.5 నుండి 1.8 కిలోల లోపు బరువు ఉన్నప్పుడు మార్కెటింగ్ పూర్తి చేయాలి.

100 కోళ్ళను పెంచుకున్నట్లయితే ఆరు నెలల వ్యవధిలో రూ. 20,000/- నికరాదాయం పొందవచ్చు. కోళ్ళ సంఖ్యను బట్టి ఆదాయాన్ని పెంచుకోవచ్చు. కోళ్ళ సంఖ్యను బట్టి ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఖర్చులు పోనూ సంవత్సరానికి 40,000 (రెండు బ్యాచ్‌లకు) వరకు నికరాదాయాన్ని పొందవచ్చు.

సరైన సమయంలో టీకాలు వేయడం, శుభ్రమైన దాణా, నీటిని ఇవ్వడం కాలక్షేపానికి ప్రతిరోజు ఒక గంట సమయం వెచ్చించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చు. ఎండాకాలంలో ఉష్ణోగ్రత నుండి కాపాడడానికి చెట్లను పెంచాలి. కోళ్ళ షెడ్‌కు దగ్గర్లో కూరగాయల పందిరి వేసుకున్నట్లయితే కూరగాయలు పొందడంతో పాటు కోళ్ళకి నీడ ఏర్పడుతుంది. సాయంత్రం సమయంలో కోళ్ళను పందిరిలోకి విడవడం ద్వారా అక్కడక్కడ ఉన్న పురుగులు, గడ్డిగింజలు తింటూ పెరుగుతాయి.

అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్, స్మార్ట్‌ఫోన్ మ్యాప్ టెక్నాలజీ వాడుకొని మార్కెటింగ్ చేసుకోవచ్చు. ముఖ్యమైన పండుగలు, బోనాలు, దసరా సందర్భాల్లో అధిక ధర పొందవచ్చు.

# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రం

డా.ఆర్.విజయ కుమారి, జి.రామ కృష్ణ, పి.వెంకటేష్, ఎ. శ్రీనివాస్,
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆర్థిక సహాయంతో స్థాపించారు. ఈ కేంద్రం 2024-25 వానాకాలం (ఖరీఫ్), యాసంగి (రబీ) కాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏ విధంగా ఉంటాయో అంచనా వేసింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయడానికి రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 22 సంవత్సరాల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేశారు. ఈ విశ్లేషణ ఫలితాలు, మార్కెట్ సర్వేలను అనుసరించి 2024-25 ఖరీఫ్, రబీ పంట కోత సమయంలో ధరలు ఏ విధంగా ఉంటాయో అంచనా వేశారు., దానిని అనుసరించి:

### 2024-25 వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:

| పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించే సమయం | అంచనా ధరలు (రూ./క్వి) |
|---|---|---|---|
| వరి (సాధారణం) | సూర్యాపేట్ | నవంబర్ - డిసెంబర్ | 2300-2540 |
| వరి(గ్రేడ్ ఏ) | జమ్మికుంట | నవంబర్ - డిసెంబర్ | 2550-2880 |
| పత్తి | వరంగల్ | నవంబర్ - ఫిబ్రవరి | 7100-7600 |
| జొన్న | గడ్డిఅన్నారం | నవంబర్ - ఫిబ్రవరి | 2200-2400 |

### 2024-25 యాసంగి (రబీ) పంట కోత సమయంలో పంట ధరలు:

| పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించే సమయం | అంచనా ధరలు (రూ./క్వి.) |
|---|---|---|---|
| వరి (సాధారణం) | సూర్యాపేట్ | మార్చి-మే | 2270-2480 |
| వరి (గ్రేడ్ ఏ) | జమ్మికుంట | మార్చి-మే | 2520-2860 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.

డా.ఆర్.విజయకుమారి, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్

మొబైల్ నం.: 9948780355, 9154828514

ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com

వెబ్ సైట్: https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక:** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 22 సంవత్సరాల ధరలను విశ్లేషించి అంచనా వేశారు. పంట రకం, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చు. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పుకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.



# యాసంగికి అనువైన వరి రకాలు

జి.ప్రణయ్, డి.అనిల్, జి.నాగేందర్, పీ.హెచ్.డి.స్కాలర్స్. ఇందిరా గాంధీ కృషి విశ్వవిద్యాలయ, రాయపూర్

తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో వరి సాగు విస్తీర్ణం సుమారుగా 50-60 లక్షల ఎకరాలలో సాగు అవుతుంది . ముఖ్యంగా దొడ్డుగింజ రకాలు యాసంగిలో ఎక్కువగా సాగులో ఉన్నాయి. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం దృష్ట్యా ఈ యాసంగిలో దొడ్డు గింజ రకాలతో పాటుగా సన్న గింజ రకాల సాగు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల యాసంగికి అనువైన ముఖ్యమైన దొడ్డు, సన్నగింజ రకాల గుణ గణాలను చూద్దాం.

**దొడ్డుగింజ రకాలు :**

**కూనారం సన్నాలు (కె.ఎన్.ఎం-118):** కాల పరిమితి - స్వల్పకాలిక రకం (125 రోజులు). పంట దిగుబడి 28-35 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - గింజ బరువు ఎక్కువగా వుండి గింజ రాలే గుణం తక్కువగా ఉంటుంది. నారుమడిదశలో కొంతవరకు చలిని తట్టుకుంటుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది.

**జగిత్యాల రైస్ -1 (జె .జి. ఎల్- 24423) :** కాల పరిమితి - స్వల్పకాలిక రకం (125 రోజులు ) పంట దిగుబడి - 28-35 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - గింజ బరువు ఎక్కువగా వుండి గింజ రాలే గుణం తక్కువగా ఉంటుంది. నారుమడిదశలో కొంతవరకు చలిని తట్టుకుంటుంది. సుడిదోమ, అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది .

**కాటన్ దొర సన్నాలు (ఎం.టి.యూ-1010) :** కాల పరిమితి - స్వల్పకాలిక రకం (120 రోజులు). పంట దిగుబడి - 25-28 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - కొత ఆలస్యమైతే గింజ రాలే గుణం కలదు. సుడి దోమను కొంతవరకు తట్టుకుంటుంది.

**ఐ.ఆర్ -64 :** కాల పరిమితి - స్వల్పకాలిక రకం (120 రోజులు). పంట దిగుబడి - 25-28 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. గింజ నాణ్యత ఎగుమతికి అనుకూలంగా బాగుంటుంది.

**విజేత (ఎం.టి.యూ-1001) :** కాల పరిమితి - మధ్యకాలిక రకం (135 రోజులు). పంట దిగుబడి - 28-30 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - సుడిదోమ, అగ్గి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది. అధిక దిగుబడినిచ్చే ముతక రకం.

**వరంగల్ రైస్ -1 (డబ్ల్యూ .జి.ఎల్. 915) :** కాల పరిమితి - దీర్ఘ కాలిక రకం (140-145 రోజులు). పంట దిగుబడి - 28-30 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు: సుడిదోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది పేలాలు, అటుకుల తయారీకి అనుకూలం

**సన్న గింజ రకాలు :**

**తెలంగాణ సోనా (ఆర్.ఎన్ .ఆర్ -15048):** కాల పరిమితి -స్వల్పకాలిక రకం (125-130 రోజులు). పంట దిగుబడి - 26-28 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు- నారుమడిదశలో కొంతవరకు చలిని, అగ్గితెగులును తట్టుకుంటుంది. గింజ రాలె గుణం, తక్కువ నూక శాతము (68-70%) కలిగి ఉంటుంది. మంచి అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది.

**కూనారం వరి 2 (కె.ఎన్.ఎమ్.1638) :** కాల పరిమితి -స్వల్పకాలిక రకం (130-135 రోజులు). పంట దిగుబడి - 28-32 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు- ఉల్లికోడు బయోటైపు 1, 3, 4 ను తట్టుకొనును. కంకి పూర్తిగా బయటకు విడుస్తుంది, పంట కోత సమయంలో గింజ రాలదు. గింజ నాణ్యత బాగా వుండి, వండిన అన్నం రుచిగా, విడివిడిగా ఉంటుంది.

**కూనారం రైస్-1 (కె.ఎన్.ఎం -733):** కాల పరిమితి -స్వల్పకాలిక రకం (125-130 రోజులు). పంట దిగుబడి - 26-32 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు- నారుమడిదశలో కొంతవరకు చలిని, అగ్గితెగులును తట్టుకుంటుంది. అన్నం నాణ్యత బాగుంటుంది.

**సాంబ మాషూరి (బి.పి.టి. 5204) :** కాల పరిమితి - దీర్ఘ కాలిక రకం (145-150 రోజులు). పంట దిగుబడి - 30-34 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు- అన్నం నాణ్యత బాగుంటుంది. సుడిదోమ, ఉల్లి కోడు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది.

**ప్రద్యుమ్న (జె.జి.ఎల్- 17004) :** కాల పరిమితి - అతిస్వల్పకాలిక రకం (100-105 రోజులు). పంట దిగుబడి - 20-22 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - ఉల్లికోడును, అగ్గితెగులును కొంతవరకు తట్టుకుంటుంది. నీటి సమస్య వున్న ప్రత్యేక పరిస్థితులకు, ఆలస్యంగా నారు పోసుకోవడానికి అనువైన రకం.

**అంజన (జె.జి.ఎల్- 11118):** కాల పరిమితి - అతిస్వల్పకాలిక రకం (110-115 రోజులు). పంట దిగుబడి - 25-27 క్వి./ఎకరానికి. ప్రత్యేక లక్షణాలు - ఉల్లికోడును, చలిని కొంతవరకు తట్టుకుంటుంది.



సాగు.. సంగతులు

# సాగు... సంగతులు..39

(వ్యవసాయంలో రైతులు మెరుగైన నిర్ణయాలు చేయడానికి ఉపయోగపడే సమాచారాన్ని వైవిధ్య వ్యవసాయ పద్ధతులను, అందుబాటులోకి వస్తున్న, వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వివరాలను ఒక దగ్గర రైతులకు అందజేసే ఉద్దేశంతోనే ఈ శీర్షిక. రైతులకు ఉపయోగపడే, మన వ్యవసాయ మెరుగుదలకు ఉపయోగపడేవన్నీ సాగు సంగతులే..)

సేకరణ-సంకలనం : కె.విజయ్ కుమార్, వ్యవసాయ అదనపు సంచాలకులు,
డి.వి.రామకృష్ణారావు, సంపాదక మండలి సభ్యులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్

## రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

2024 అక్టోబర్ 09న హైదరాబాద్‌లో బి.ఆర్.కె.భవన్‌లోని కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ఎం.కోదండరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ నిపుణులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, ఎన్.జి.ఒ.లు వ్యవసాయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా అవసరమైన సూచనలు చేయాలని కోరారు.

## వ్యవసాయ కమిషన్‌కు ఏడుగురు సభ్యులు

తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు సభ్యులను నియమించింది. ఈ మేరకు 2024 అక్టోబర్ 21న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎం.ఎల్.సి. రాములు నాయక్‌తో పాటు ఎం.సునీల్ కుమార్ (హైదరాబాద్), రామిరెడ్డి గోపాల్ రెడ్డి (ఖమ్మం జిల్లా), గడుగు గంగాధర్ (నిజామాబాద్ జిల్లా), చెవిటి వెంకన్న యాదవ్ (సూర్యాపేట జిల్లా), కె.వి.నర్సింహారెడ్డి (నాగర్‌కర్నూల్ జిల్లా), మరికంటి భవాని రెడ్డి (సిద్ధిపేట జిల్లా)లను నియమించారు. చైర్మన్‌తో పాటు వీరి పదవీ కాలం రెండేళ్ళు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులలో పేర్కొంది.

## మొక్కలూ మాట్లాడతాయి

మొక్కలకు జీవం ఉంటుందనేది అందరికీ తెలిసిన విషయమే. మన మాటలు, శబ్దాలకు మొక్కలు ప్రతిస్పందిస్తాయని కూడా పలువురు శాస్త్రవేత్తలు చెబుతుంటారు. ఇప్పుడు మొక్కలు మనతో తిరిగి మాట్లాడే కొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహాయంతో యూ.కె.కి చెందిన టామ్ మెస్సే.జె అప్నా అనే ఇద్దరు గార్డెనర్‌లు దీనిని తయారు చేశారు. దీనిని వచ్చే ఏడాది జరగనున్న కార్యక్రమంలో ప్రదర్శించనున్నారు. మనం అడిగిన ప్రశ్నలకు తోట సమాధానాలు ఇస్తుందని మెస్సే చెప్పారు.

## రాష్ట్రంలో సీడ్ గార్డెన్ ఏర్పాటు

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో సొంతంగా సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తామని అందుకు తగిన అవకాశాలను పరిశీలిస్తున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 2024 అక్టోబర్ 24 నుంచి మూడు రోజుల పాటు మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి సీడ్ గార్డెన్ ప్రతినిధులతో అక్టోబర్ 24న సమావేశం అయ్యారు. ఎఫ్.జి.వి. కంపెనీ సీడ్ గార్డెన్, నర్సరీలు అధునాతన సాంకేతిక పద్ధతులతో నిర్వహిస్తున్న విత్తన గార్డెన్‌లను సందర్శించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు వ్యవసాయ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, ఐ.ఎ.ఎస్.పాల్గొన్నారు.

## రైతు దినోత్సవం సందర్భంగా..

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి)లో 2024 అక్టోబర్ 24న జరిగిన రైతు దినోత్సవానికి రైతుసంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోందడరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. కె.వి.కె.లు, స్వచ్ఛంద సంస్థలు విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి అల్దాస్ జానయ్య, ఇరి సంచాలకులు ఆర్.ఎం. సుందరం, ఐకార్ అటారి డైరెక్టర్ మీరా, పలువురు శాస్త్రవేత్తలు, పలు రాష్ట్రాల రైతులు పాల్గొన్నారు.

## నూనెగింజల సాగు లాభదాయం

నూనెగింజల సాగు అన్నదాతలకు అన్ని విధాల లాభదాయకమని, పంటల మార్పిడి కింద అందరూ ఈ పంటలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనెగింజల పరిశోధనా, ప్రణాళిక రూపకల్పనపై రెండు రోజుల జాతీయ సదస్సు 2024 అక్టోబర్ 28-29 తేదీల్లో జరిగింది. జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టి.ఆర్.శర్మ, ఎ.డి.జి. సంజీవ్ గుప్తా, ఐకార్ డైరెక్టర్ మాధుర్, వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ జల్లా సత్యనారాయణ, ప్రధాన శాస్త్రవేత్త సి.సుధాకర్, 150 మంది శాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. నూనెగింజల సాగు వ్యయం తక్కువగా ఉండడంతో పాటు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, వాతావరణ మార్పులను తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు తెలియజేశారు.

## రైతునేస్తం అవార్డులు ప్రధానం

రైతునేస్తం 20వ వార్షికోత్సవ సందర్భంగా 'రైతునేస్తం' పురస్కారాలను వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభా పాటవాలు ప్రదర్శించినవారికి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డా.ఐ.వి.సుబ్బారావు పేరిట అవార్డులతో 2024 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరం సమీపంలోని ఆత్కూర్ గ్రామంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రైతునేస్తం ఫౌండర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు సహా శాస్త్రవేత్తలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా నవంబర్ 2024లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 01.11.2024<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | మొక్కజొన్న పంటలో సస్యరక్షణ | డా.కె.వాణిశ్రీ<br>శాస్త్రవేత్త | మొక్కజొన్న పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9494407924<br>vani.ento@gmail.com |
| 04.11.2024<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | కూరగాయల పంటల్లో పోషక లోపాలు, భౌతికపరమైన లోపాలు, వాటి యజమాన్యం | డా.ఆర్.ప్రీతమ్ గౌడ్<br>సీనియర్ శాస్త్రవేత్త | కూరగాయల పరిశోధనా స్థానం<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9440130030<br>rachala_p@rediffmail.com |
| 06.11.2024<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | యాసంగి వరిలో అధిక దిగుబడులకు మేలైన యాజమాన్య పద్ధతులు | డా.వి.వెంకన్న<br>ప్రధాన శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,<br>వరంగల్<br>ఫోన్ : 9949317565<br>vvenkanna09@gmail.com |
| 08.11.2024<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు | డా.ఎం.శ్రీనివాస్<br>అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఉద్యాన కళాశాల,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 898572135<br>srinivasmajjiga45@gmail.com |
| 11.11.2024<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పాలు, మాంసం ద్వారా మనుషులకు వచ్చే వ్యాధులు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు | డా.ఎ.విజయ్ కుమార్<br>అసిస్టెంట్ ప్రొఫెసర్ & హెడ్ | పశువైద్య కళాశాల,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 949200734<br>anumolu.vk@tsvu.edu.in |
| 13.11.2024<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | ఉద్యాన పంటల్లో పోషకాల ప్రాముఖ్యత | డా.ఎస్.ప్రణీత్ కుమార్<br>శాస్త్రవేత్త | పూల పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 8106746326<br>suvarnapraneeth@gmail.com |
| 15.11.2024<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పశువులలో పునరుత్పత్తి సమస్యలు వాటి నివారణ | డా.జి.రాజ కొండారెడ్డి<br>అసిస్టెంట్ డైరెక్టర్ | జిల్లా పశుసంవర్ధక శాఖ<br>సీతారామపేట, హైదరాబాద్<br>ఫోన్ : 8686719090<br>grkreddy1967@gmail.com |
| 18.11.2024<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | చేపల పెంపకంలో శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు | మహ్మద్ ఖదీర్ అహ్మద్<br>డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ | మత్స్యశాఖ కమీషనర్ కార్యాలయం,<br>మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్<br>ఫోన్ : 8106746326<br>khadeerahamed6@gmail.com |
| 20.11.2024<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | సూటి రకాల వరి విత్తనోత్పత్తిలో మెళకువలు, యాజమాన్య పద్ధతులు | డా.పి.మధుకర్<br>శాస్త్రవేత్త | ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,<br>జగిత్యాల<br>ఫోన్ : 9908850198<br>madhu0743@gmail.com |




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 22.11.2024<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | కంజు పక్షుల పోషణలో తీసుకోవాల్సిన యాజమాన్య మెళకువలు, మార్కెటింగ్ విధానం | డా.డి.రాంబాబు<br>అసోసియేట్ ప్రొఫెసర్ | పశువైద్య కళాశాల,<br>కోరుట్ల<br>ఫోన్ : 9440363457<br>ram_vetdoc@rediffmail.com |
| 25.11.2024<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | యాసంగి వరి రకాలు, మేలైన యాజమాన్య పద్ధతులు | డా.ఎల్.కృష్ణ<br>ప్రధాన శాస్త్రవేత్త | వ్యవసాయ పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9866091711<br>lavuri.krishna@gmail.com |
| 27.11.2024<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వివిధ యాసంగి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు | డా.ఆర్.శ్రవన్ కుమార్<br>శాస్త్రవేత్త | జిల్లా పశువైద్యశాఖ<br>సీతారాంపేట, హైదరాబాద్<br>ఫోన్ : 8686719090<br>shravanentomology@gmail.com |
| 29.11.2024<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | ద్రాక్షలో శీతాకాలపు కత్తిరింపుల తర్వాత సమగ్ర సస్యరక్షణ | డా.కె.వెంకట రమేష్<br>శాస్త్రవేత్త | ద్రాక్ష పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9490879220<br>kvrameshagri@gmail.com |

# వ్యవసాయశాఖ ఇంగ్లీష్ వెబ్ సైట్




ఇంగ్లీష్ వెబ్‌సైట్ http://agri.telangana.gov.in

08 నవంబర్ 2024 నాటికి ఇంగ్లీష్ వెబ్‌సైట్ సందర్శకుల సంఖ్య : 8,34,125

2024 నవంబర్ 9న వ్యవసాయ అధికారుల శిక్షణా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్., రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోందడరెడ్డి, డా.పాండురంగారెడ్డి, హెడ్, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్, సహా ఉన్నతస్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు, శిక్షణలో పాల్గొన్న కొత్త వ్యవసాయ అధికారులు, తదితరులు








**05 నవంబర్ 2024న వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి ఐ.ఎ.ఎస్. నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో ఆదర్శ రైతులు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వేణుగోపాల్ రెడ్డి, మంచిర్యాలకు చెందిన ఎం.శ్యామ్‌సుందర్ రెడ్డి యాసంగి పంటలలో కలుపు, సస్యరక్షణ గురించి రైతులకు సలహాలు సూచనలు అందించారు.**




**04 నవంబర్ 2024న హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని సమీకృత ప్రయోగశాలల సముదాయాన్ని వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి ఐ.ఎ.ఎస్., వ్యవసాయ అదనపు సంచాలకులు కె.విజయ్ కుమార్ సందర్శించారు. ఆ సందర్భంగా వ్యవసాయ అధికారులతో ప్రయోగశాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.**



Printed & Published by **Dr. B. Gopi, I.A.S,** Director of Agriculture,
Government of Telangana, Basheer Bagh, Hyderabad - 500 001 on behalf of Commissioner & Director of Agriculture,
Telangana, through Telangana State Agro Industries Development Corporation Limited (TSAIDC Ltd.)
**Designed** at M/s.Sri Chaithanya Graphics, Flat No.109, Tirumala Apartments, Skyline Road, Basheerbagh, Hyderabad - 500029. **Editor : K. Vijay Kumar**